PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 320 | విజయవాడ, బుధవారం 21 జూన్ 2023 | 8+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 21 June 2023



నెల్లిపాకలో మంగళవారం ప్రారంభమైన పోలవరం నిర్వాసితుల మహాపాదయాత్ర, అగ్రభాగంలో విజ్జుకృష్ణన్, వి శ్రీనివాసరావు, పి సుదర్శన్, కుంజా రాధ

సిటీ

సమరోత్సాహంతో పోలవరం పోరు కేక

- నిర్వాసితుల హక్కుల కోసం నెల్లిపాకలో సిపిఎం మహా పాదయాత్ర ప్రారంభం
- పునరావాసంపై తాడోపేడో : ప్రారంభోత్సవ సభలో విజ్జుకృష్ణన్, విఎస్ఆర్

లోపలి పేజీలో..

రక్షణ సహకారమే కీలక పునాది

- ప్రధాని నరేంద్ర మోడీ

న్యూ ఢిల్లీ : భారత్, అమెరికాల మధ్య గతంలో ఎన్నడూ లేని రీతిలో విశ్వాసం నెలకొందని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, వైవిధ్యతపై విలువలను పంచుకోవడం ప్రాతిపదికగా రెండు దేశాల మధ్య సంబంధాలను ఈ పర్యటన మరింత సుస్థిరం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అమెరికా బయలుదేరి వెళ్లడానికి ముందుగా ఆయన మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొనడంలో కూడా కలిసి బలంగా నిలబడతామన్నారు. ప్రధాని అయిన తర్వాత అమెరికాలో మోడీ పర్యటించడం ఇది ఆరోసారి. ఈ పర్యటనా సమయంలో అమెరికా నాయకత్వాన్ని, కాంగ్రెస్ సభ్యులను, సిఇఓలను, ఇండియన్, అమెరికన్ కమ్యూనిటీని కలుసుకుంటారు. వాణిజ్య, ఇంధన సంబంధాలను పెంపొందించడం, సైన్స్, టెక్నాలజీ, విద్య, ఆరోగ్య రంగాల్లో సహకారంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నారు.



ప్రతి ఒక్కరూ బడిబాట పట్టాలి

- కనీసం డిగ్రీతో బయటకు రావాలి
- ఆణిముత్యాలు కార్యక్రమంలో సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి ఒక్కరూ బడిబాట పట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. చదువు కోసం పేదలు అప్పులపాలు కాకూడదని, చదువులకు దూరం కాకూడదని ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. విదేశాల్లో సీటు తెచ్చుకుంటే ఫీజుల కోసం భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తోడుగా ఉంటుందని అన్నారు. 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం విజయవాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. పిల్లలందరూ ప్రతి రంగంలోనూ ఎదిగి ఎగరాలని, ప్రపంచానికి లీడర్లుగా ఉండాలనే తపన, తాపత్రయంతో అడుగులు వేస్తున్నామని సిఎం చెప్పారు. అందుకనే నాలుగేళ్లలో నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వం శ్రద్ధ పెట్టిందన్నారు. ప్రభుత్వ బడులు, పాఠశాలలను మరింత గొప్పగా మార్చాలన్న కోరిక మరింతగా పెరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ కనీసం డిగ్రీతో బయటకు రావాలన్నారు. ప్రైవేటు బడులు.. గవర్నమెంటు బడులతో పోటీ పడక తప్పదనే పరిస్థితి తీసుకొచ్చామన్నారు. పిల్లలందరికీ మంచి చదువులు ఉండాలని మేనమామగా కోరుకుంటున్నాని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ సిలబస్ కూడా తీసుకొచ్చే కార్యక్రమం జరుగుతుందని, పరీక్షలు కూడా అలానే ఉంటాయని చెప్పారు. మెదడులోకి డ్రిల్ చేసి రాయడం కాకుండా పరీక్షలకు టెక్స్ట్‌బుక్స్ తీసుకునిపోయినా ఫర్వాలేదనే విధానంలోకి మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. చదువులు వేగంగా మారుతున్నాయని తెలిపారు. మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ మిగతా 2లో



సెమినార్‌లో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి గోపాలగౌడ

కార్పొరేట్ల గుప్పెట్లో మీడియా

- కనుమరుగవుతున్న పరిశోధనాత్మక జర్నలిజం
- ఎంహెచ్ స్మారకోపన్యాసంలో రిటైర్డు సుప్రీం జడ్జి జస్టిస్ గోపాల గౌడ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా నాడు ఏర్పచుకున్న లక్ష్యాలు చేరుకోవడంలో ఇంకా సుదూరంగానే ఉన్నామని రిటైర్డు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ గోపాల గౌడ్ అన్నారు. ఇప్పటికీ రాజ్యాంగం ముందు అనేక సవాళు ఉన్నాయని తెలిపారు. మోటూరు హనుమంతరావు లాంటి నాయకులు నేటి తరానికే కాకుండా తనలాంటి వారికి కూడా మార్గదర్శకులని కొనియాడారు. ఆయన మార్గదర్శకంలోనే ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపకుల్లో తాము ఒకరిగా ఉన్నామని చెప్పారు. మోటూరు హనుమంతరావు ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని జానకిరామయ్య కళ్యాణమండపంలో మంగళవారం జరిగింది. 'రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు-మీడియా పాత్ర' అనే అంశంపై ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్ అధ్యక్షతన జరిగిన సభలో గోపాల గౌడ్ ప్రసంగించారు. జనాభాలో సగభాగమున్న స్త్రీలకు ఇప్పటికీ సమానత్వం సాధించలేకపోయామని చెప్పారు. చట్టసభల్లో ఇప్పటికీ 25 శాతం సీట్లు ఇవ్వలేకపోతున్నామన్నారు. ఇందులో న్యాయవ్యవస్థ మినహాయింపు కాదని చెప్పారు. సామాజిక, ఆర్థిక సమానత్వమూ ఇంకా అందలేదని విచారం వ్యక్తం చేశారు. పోర్తు ఎస్టేట్‌గా చెప్పుకునే మీడియాలోనూ పరిశోధనాత్మకత చచ్చిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దఎత్తున కార్పొరేట్ ప్రకటనలపై ఆధారపడిన మీడియా అందుకు అనుగుణంగానే వార్తలిస్తోందే తప్ప ప్రజా సమస్యలపై పరిశోధనాత్మకత కథనాలిచ్చే పరిస్థితి లేదని చెప్పారు. దేశంలో 2014 నుంచి 2020 మధ్య మీడియాకు వచ్చిన ప్రకటనల విలువ రూ.6,500 కోట్లు అని గుర్తు చేశారు. ఇంత పెద్దఎత్తున ప్రకటనలు పొందుతున్న మీడియా... వ్యతిరేక కథనాలివ్వగలదా అని ప్రశ్నించారు. అయితే స్వతంత్ర జర్నలిస్టులు కొందరు అక్కడక్కడా ప్రజా సమస్యలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అటువంటి జర్నలిస్టులపైనా దాడులు తప్పడం లేదని చెప్పారు. మరోవైపు దేశంలో మత విద్వేషాలు పెరుగుతున్నా యన్నారు. మెజార్టీ, మైనార్టీ అన్న మిగతా 2లో



మహా పాదయాత్ర ప్రారంభోత్సవ సభలో అభివాదం చేస్తున్న విజ్జు కృష్ణన్, వి శ్రీనివాసరావు, పోతినేని సుదర్శన్, మంతెన సీతారాం, వి వెంకటేశ్వర్లు, బలరాం, కుంజా రాధా తదితరులు



పాదయాత్రలో నిర్వాసితుల నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న వివిఎస్ఆర్

నిర్వాసితుల హక్కుల కోసం తాడోపేడో

- పునరావాసం తర్వాతే ప్రాజెక్టు
- నెల్లిపాకలో సిపిఎం మహా పాదయాత్ర ప్రారంభం
- సమరోత్సాహంతో 'పోలవరం పోరు కేక'

నెల్లిపాక నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు కోసం తమ ఊళ్లు, ఇళ్లు, భూములు త్యాగం చేసిన నిర్వాసితుల హక్కుల సాధనకై తాడోపేడో తేల్చుకుంటామని సిపిఎం హెచ్చరించింది. అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం పోలవరంలో మునుగుతున్న లక్షకుపైగా కుటుంబాలకు చట్టాల ప్రకారం, ఇచ్చిన హామీల మేరకు సహాయ, పునరావాసం కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రాజెక్టు కారణంగా నిరాశ్రయులైన చిట్టచివరి వ్యక్తి వరకు పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణం చేయాలని డిమాండ్ చేసింది. నిర్వాసితుల పునరావాసం కోసం పదేళ్ల నుంచి ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో 'పోలవరం నిర్వాసితుల పోరు కేక' పేరిట మహా పాదయాత్రకు సిపిఎం శ్రీకారం చుట్టింది. జూన్ 20 నుంచి జులై 4 వరకు పదిహేనురోజుల పాటు నెల్లిపాక నుంచి విజయవాడ వరకు 400 కిలోమీటర్లు సాగే మహా పాదయాత్ర ఎటపాక మండలం నెల్లిపాక సెంటర్‌లో మంగళవారం మధ్యాహ్నం సమరోత్సాహంతో ప్రారంభమైంది.

పాదయాత్రకు సారథ్యం వహిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గిరిజన సంప్రదాయ కొమ్ముబూరతో శంఖారావం పూరించగా, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు విజ్జు క్రిష్ణన్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. అంతకుముందు బహిరంగసభ నిర్వహించారు. సభలో ప్రసంగించిన నేతలందరూ నిర్వాసితుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. నిర్వాసితుల న్యాయమైన హక్కులు సాధించేవరకు వెనుదిరిగేది లేదని దీక్ష బూనారు.

జీవన్మరణ పోరాటం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విజ్జు క్రిష్ణన్ మాట్లాడుతూ నిర్వాసితులది జీవన్మరణ పోరాటమన్నారు. పాదయాత్ర ఆరంభం మాత్రమే. వేరే ప్రదేశానికి సాగునీరు, అభివృద్ధి కోసం సర్వం త్యాగం చేశారు. వారి విషయంలో బిజెపి, వైసిపి రెండు ప్రభుత్వాలూ స్పందించట్లేదు. పోరాటాలతోనే ప్రభుత్వాలను కదిలించగలుగుతాం. బ్రిటీష్ కాలంలోని 1894 భూసేకరణ చట్టానికి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటాలు చేసినందునే 2013 చట్టం వచ్చింది. దాని అమలుకు యుపి, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో పోరాటాలు జరుగుతున్నాయి. మోడీ ప్రభుత్వం ఆదివాసీల భూములను బలవంతంగా అదానీ వంటి వారికి లక్షల ఎకరాలు సేకరిస్తోంది. నాసిక్ నుంచి ముంబయికి లాంగ్ మార్చ్ మొదలైనప్పుడు ఏముందిలే అనుకున్నారు. మహారాష్ట్ర సర్కారు దిగి రావాల్సి వచ్చింది. మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదికిపైన సాగిన పోరాటంతో మోడీ సర్కారు చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది. ఆ స్ఫూర్తితో పోలవరం నిర్వాసితులు పోరాడాలి..



నెల్లిపాకలో జరిగిన బహిరంగ సభలో హక్కుల సాధన కోసం నినదిస్తున్న పోలవరం నిర్వాసితులు

గోదారిలో ముంచుతాం

నిర్వాసితులను పట్టించుకోకుండా వారిని గోదారిలో ముంచాలని ప్రభుత్వం చూస్తే ప్రభుత్వాన్నే గోదారిలో ముంచుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. పదవుల కోసం, అధికారం కోసం పాదయాత్రలు చేపడుతున్నారు. మా పాదయాత్ర అందుక్కాదు. ప్రాజెక్టులో మునుగుతున్న గిరిజనులు, ఎస్‌సిలు, బిసిలు, పేద వర్గాల భవిష్యత్తు కోసం. వారి న్యాయమైన సమస్య పరిష్కారం కోసం. తరచు ముఖ్యమంత్రి పోలవరం నిదుల కోసం ఢిల్లీ వెళుతున్నారు. అక్కడి నుంచి కేంద్ర పెద్దలు, అధికారులు ఇక్కడికి వస్తున్నారు. కేంద్రం గల్లా పట్టుకొని నిధులు తెచ్చుకోమనే చెబుతున్నాం. ఆ నిధులు తొలుత నిర్వాసితులకు కాకుండా కాంట్రాక్టర్లకు ఖర్చు చేస్తున్నారు. ప్రాజెక్టు ఎత్తు ఎంత, డయాఫ్రంవాల్ దెబ్బతినడానికి మీరు కారణమంటే మీరు అని వైసిపి, టిడిపి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ముంపు ప్రాంతాల్లో విద్య, వైద్యం, సంక్షేమం, ఉద్యోగాలు ఏమీ లేవు. చిన్న వరదలకే అంచనాలకు మించి గ్రామాలు మునుగుతున్నాయి. పోయిన వరదల్లో ముంపునకు గురైన వారికి పరిహారం ఇవ్వలేదు. మళ్లీ వరదలొస్తున్నాయి. ఏం చర్యలు చేపట్టారు? మోడీ ఆర్డర్ వేస్తే జగన్ పని చేస్తున్నారు. నిర్వాసితుల సమస్య తీవ్రతను గుర్తించాలి. లేకపోతే పోరాటంతో గుర్తించేలా చేస్తాం. తేల్చుకుంటాం. ప్రజలు పైసా పైసా వేసుకొని పాదయాత్రను నడిపిస్తున్నారు. ఇది తెలుగు ప్రజలందరి ఉమ్మడి సమస్య. పాదయాత్ర జయప్రదానికి అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు, సంఘీభావం, సహాయ సహకారాలు అందించాలి. ఈ నెల 26న సంఘీభావ దినం పాటించాలని కోరుతున్నాం. జులై 1న ట్రేడ్ యూనియన్లు సంఘీభావం ప్రకటిస్తామని ముందుకొచ్చాయి..

నిద్ర లేపడానికే..

మొద్దు నిద్ర పోతున్న ప్రభుత్వాన్ని నిద్ర లేపడానికే మహా పాదయాత్ర అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు అన్నారు. లక్షా ఆరు వేల కుటుంబాలకు పరిహారం ఇచ్చాకనే ప్రాజెక్టు నుంచి నీళ్లివ్వాలన్నారు. అలా కాకపోతే తెగించి పోరాడతామన్నారు. గిరిజనులకు ఎర్ర జెండానే అండగా ఉంటుందన్నారు. మహా పాద యాత్ర విజయవంతం కావాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి సుదర్శన్ ఆకాంక్షించారు.

ప్రాజెక్టు కడతారన్నదగ్గర నుంచి నిర్వాసితులయ్యే గిరిజనులు, ఇతరుల పక్షాన పార్టీ పోరాడుతోందన్నారు. అప్పట్లో భద్రాచలంలో కాల్పులు జరిగాయని, ఆ కేసులు మొన్నటి వరకు ఉన్నాయన్నారు. సమస్య ఎ.పి.దే కాదని ఉమ్మడి రాష్ట్రానిదన్నారు. సభకు సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి కిరణ్ అధ్యక్షత వహించగా పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లా పార్టీ కార్యదర్శులు బి బలరాం, టి అరుణ్, ఎ రవి, పార్టీ, ప్రజాసంఘాల నాయకులు వేదికపై ఆశీనులయ్యారు.



మహాపాదయాత్రకు సిపిఐ తరపున సంఘీభావం తెలియజేస్తున్న గన్నవరం ఎంపిటిసి రాజు

పుస్తకావిష్కరణ

మహా పాదయాత్రను పురస్కరించుకొని 'పోలవరం' వివరాలతో పార్టీ ప్రచురించిన పుస్తకాన్ని విజ్జు క్రిష్ణన్, పాటల సి.డి.ని పి సుదర్శన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ పాదయాత్ర అనేది గోదావరి చరిత్రలో పార్టీ చరిత్రలో ఒక చిన్న ప్రస్థానమన్నారు. కళ్లుండి చూడలేని, చెవులుండి వినలేని ప్రభుత్వాన్ని మన పోరు కేకతో కదిలించాలన్నారు. పాదయాత్రలో సమరోత్సాహంతో పాల్గొనాలని, ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో పాల్గొంటున్న వలంటీర్లతో వి శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. గిరిజనుల సంప్రదాయ వేషధారణతో నాయకులు పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వితరణలు

పాదయాత్ర విజయవంతానికి పశ్చిమగోదావరి సిపిఎం కమిటీ తరపున రూ.50 వేలు, భద్రాద్రి-కొత్తగూడెం పార్టీ జిల్లా కమిటీ తరపున రూ.10 వేలు అందించారు. పాదయాత్రలో పాల్గొనే వారికి రెయిన్ కోట్లు, గొడుగులను కాకినాడ మహిళాసంఘం అందించింది.

తొలిరోజు 16 కిలోమీటర్లు

పాదయాత్ర ప్రారంభమైన తొలి రోజు ఎటపాక మండలంలోని గ్రామాల్లో 16 కిలోమీటర్లు సాగింది. రాత్రి మురుమురు గ్రామంలో వలంటీర్లు బస చేశారు.



నెల్లూరులోని వెంకటేశ్వరనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు

విద్యుత్ ఛార్జీల బాదుడు వద్దు

- వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజలపై విద్యుత్ భారాలను మోపడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన పలు జిల్లాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద మంగళవారం ధర్నాలు, ఆందోళనలు చేశారు. ట్రూఅప్, సర్వీసు, ఇందన ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన విరమించుకోవాలని, పెంచిన కరెంటు బిల్లులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నెల్లూరులోని కిసాన్‌నగర్ సెంటర్ నుండి ఈస్ట్ పేస్-1 సబ్ స్టేషన్ వరకు సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారికి వినతిపత్రం అందజేశారు. వెంకటేశ్వరపురం జనార్దన్‌రెడ్డి కాలనీలో నిరసన తెలిపారు. అనకాపల్లి జిల్లా మునగపాక, కె.కోటపాడు, అచ్యుతాపురం, నక్కపల్లి మండల కేంద్రాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు చేశారు. విశాఖ జిల్లా చిట్టివలసలో ఎఇ రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. అనకాపల్లిలో సిపిఐ ఆధ్వర్యాన తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. చిత్తూరులోని విద్యుత్ కార్యాలయం ఎదుట సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేసి, కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 30న ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు నాయకులు హెచ్చరించారు. ఏలూరు జిల్లా నిడమర్రు మండలంలోని బువ్వనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సిపిఐ నేతలు విద్యుత్ బిల్లులను దహనం చేశారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడండి

- గవర్నరును కోరిన టిడిపి

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు టిడిపి నేతలు ఫిర్యాదు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 355 అమల్జేసి కేంద్రం జోక్యంతో రాష్ట్రంలో శాంతి నెలకొనేందుకు చర్యలు తీసుకోవాలని ఆయనకు విన్నవించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు నేతృత్వంలోని బృందం మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నరును కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అచ్చెన్నతో పాటు గవర్నరును కలిసిన వారిలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు, బోండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, అనగాని సత్యప్రసాద్ ఉన్నారు. అనంతరం మీడియాతో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న హత్యాకాండ, దమనకాండను గవర్నరుకు వివరించామని తెలిపారు. గడిచిన 15 రోజులు రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో దాడులు జరుగుతున్నాయన్నారు. రేపల్లెలో పదోతరగతి పిల్లాడిని పథకం ప్రకారమే చంపేశారని, విశాఖపట్నంలో భూదోపిడీల కారణంగా అధికార పార్టీ ఎంపి కుటుంబ సభ్యుల కిడ్నాప్‌కు గురయ్యే పరిస్థితి నెలకొందని, ఏపిలో వ్యాపారాలు చేసుకోలేమని అధికార పార్టీ ఎంపియే చెప్పారంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతగా క్షీణించాయో అర్థం చేసుకోవచ్చునని అచ్చెన్న వాపోయారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులను ప్రజా ఉద్యమాలను, ప్రతిపక్ష గళాలను అణచివేయడానికే దుర్వినియోగం చేస్తున్నారని తప్పుబట్టారు. రాష్ట్రంలో ఇంత దారుణమైన పరిస్థితులు ఉన్నా శాంతిభద్రతలు బాగున్నాయని డిజిపి చెప్పడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ విధానాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. జగన్ వచ్చాక ఈ విధానాన్ని ఎత్తివేశారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి స్పందించాలని కోరారు. రాష్ట్రంలో అదుపు తప్పిన శాంతిభద్రతలను నియంత్రించేందుకు మణిపూర్ తరహాలో ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. గవర్నరు తమ ఫిర్యాదు పట్ల సానుకూలంగానే స్పందించారని, తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

కాగా ప్రతిపక్ష టిడిపి నాయకులు, కార్యకర్తలపై అధికార మదంతో వైసిపి నేతలు దమనకాండకు పాల్పడుతూనే ఉన్నారని మంగళవారం మరో ప్రకటనలో అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో వైసిపి శ్రేణులు రాళ్లు, కర్రలతో చేసిన దాడిలో టిడిపి కార్యకర్త సాకే రామయ్య మృతిచెందడం అత్యంత బాధాకరమన్నారు. మరణానికి కారణమైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కారంపూడి టిడిపి మండల అధ్యక్షులు ఉన్నం లక్ష్మీనారాయణ, సైదాపై వైసిపి నేతలు హత్యాయత్నానికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.


ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ప్రభుత్వ రంగంతోనే రాజ్యాంగ హక్కులు సాధ్యం



ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

ప్రభుత్వ రంగంతోనే రాజ్యాంగ హక్కులు సాధ్యమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంనాటికి 859వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా యు.రామస్వామి మాట్లాడుతూ.. కార్మిక హక్కుల సాధన, రిజర్వేషన్ల కొనసాగింపు కోసం ప్రభుత్వ రంగ సంస్థల ఉనికి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ అధ్యక్షులు బి తౌడన్న, నాయకులు ఎస్.సత్యనారాయణ, ఫణింద్రబాబు, వేణుగోపాల్, పైడికొండలరావు, మోహన్‌బాబు, గణేష్, కెవి.రత్నం, లక్ష్మణమూర్తి, పుల్లయ్య, ఎల్‌వి.రమణ పాల్గొన్నారు.

విజయవాడలో భారీ వర్షం

- పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-విజయవాడ, ఎ.కొండూరు

అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు నైరుతి రుతుపవనాలు కాస్త ఉపశమనం కలిగించే సంకేతాలు అందించాయి. ఈ నెల 11 నుంచి కర్ణాటక-ఎపి సరిహద్దు వద్ద నిలిచిపోయిన రుతుపవనాల్లో కదలిక ప్రారంభమైంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షం పడింది. విజయవాడలో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. గత రెండు వారాలుగా నగరంలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎండ తీవ్రతకి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. మంగళవారం కురిసిన వర్షంతో విజయవాడ ప్రజలు సేదతీరారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని నందిగామ, విజయవాడ, తిరువూరు, మైలవరం, కృష్ణా జిల్లాలోని గన్నవరం, ఉయ్యూరు, పామర్రు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో గేదెలు మేపడానికి వెళ్లిన తుళ్లూరు రామారావు (54) పిడుగుపాటుకు మృతి చెందారు. రుతుపవనాల ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు, మిగిలిన చోట్ల తెలికపాటి జల్లులు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం పార్వతీపురం, ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం నెల్లూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. పిడుగులు పడే అవకాశం ఉన్నందున వ్యవసాయ కూలీలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

గుడ్డిగా బిజెపికి వత్తాసు పలకను

- ఆత్మీయ సమావేశంలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ముస్లిముల భద్రత, గౌరవానికి ఏ మాత్రం భంగం వాటిల్లకుండా జనసేన పార్టీ చూసుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. తాను వైసిపిలా గుడ్డిగా బిజెపికి వత్తాసు పలకనని తెలిపారు. వారాహి యాత్రలో భాగంగా కాకినాడలో ముస్లిం ప్రతినిధులతో పవన్ కల్యాణ్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎవరు ఏ మతాన్ని నమ్మినా.. ఏ దేవుడిని పూజించినా.. ఎవరికీ ఇబ్బంది లేదు. కేవలం రాజకీయాల కోసం మతాన్ని వాడుకునే వారితోనే అందరికీ ఇబ్బంది' అని అన్నారు. భారతదేశంలో ముస్లిములు ఏనాటికీ మైనార్టీలు కాదు.. ఈ దేశం మనందరిదని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిముల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా, ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏ మతంలోనైనా విపరీతవాదాన్ని అందరం ముక్త కంఠంతో ఖండించాలని సూచించారు. జనసేన అధికారంలోకి వస్తే ప్రజా ప్రభుత్వంలో అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ అధికారంలోకి వస్తే ఉర్దూ మీడియాన్ని మళ్లీ తీసుకొస్తామని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నయూబ్ కమల్, నాయకులు అర్భాంఖాన్, కందుల దుర్గేష్, పంతం నానాజీ, ముత్తా శశిధర్ పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ కోసం పోరుబాట

- 22 నుంచి వివిధ రూపాల్లో ఉద్యమం
- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక జెఎసి నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు రెగ్యులరైజేషన్ కోసం పోరుబాట పట్టనున్నారు. ఈ నెల 22 నుంచి వివిధ రూపాల్లో ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ టీచర్స్ వర్కర్స్ జెఎసి నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి జెఎసి నాయకులు మంగళవారం నాడు ఈ మేరకు ఒక వినతిపత్రం కూడా అందజేశారు. ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఆలోగా సమాన పనికి సమాన వేతనం, సమాన సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు.

ఈ నెల 18న విజయవాడలో జరిగిన రాష్ట్ర సదస్సులో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22 నుంచి ఆగస్టు 14 వరకు చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణను రూపొందించారు. జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, సెక్రటరీ జనరల్ ఎం బాలకాశి కార్యాచరణను ప్రకటించారు. వివిధ ప్రభుత్వశాఖలతో పాటు ఆర్‌టిసి, విద్యుత్, స్థానిక సంస్థలు, నేషనల్ హెల్త్‌మిషన్, యూనివర్సిటీలు, ఉపాధి హామీ పథకం, టిటిడి తదితర సంస్థల్లో దాదాపు 3 లక్షల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఏనాటికైనా రెగ్యులర్ అవుతామని ఆశించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం కేవలం 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు పూర్తిచేసుకున్న వారినే రెగ్యులర్ చేస్తామని నిబంధన పెట్టడంతో కేవలం 6,667 మంది మాత్రమే రెగ్యులర్ కానున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అందరినీ రెగ్యులర్ చేయాల్సి వుండగా, కేవలం కొద్దిమందికి మాత్రమే అమలు చేయడం సరికాదని జెఎసి నాయకులు పేర్కొన్నారు. 2022 డిసెంబరు 31 నాటికి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్‌తోపాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, పార్ట్‌టైమ్, గెస్ట్ వ్యవస్థను ఫుల్‌టైమ్‌గా మార్చాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఇదీ ఉద్యమ కార్యాచరణ..

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22న టోల్‌ఫ్రీ నెంబర్ 1902కు ఫోన్లు చేయడం
- ఇదే నెల 25న అన్ని జిల్లాల్లో సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించడం
- జులై 2న మండల, పట్టణ ప్రాంతాల్లో సదస్సులు
- జులై 5న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇ-మెయిల్ ద్వారా వినతులు పంపడం
- జులై 8న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఒడిలకు మెయిల్స్ పంపడం
- జులై 15న మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వడం
- జులై 20న జిల్లా అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం
- జులై 24 అన్ని కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు చేసి కలెక్టర్లకు విన్నవించడం
- ఆగస్టు 5న నిరాహార దీక్షలు
- ఒకవేళ అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే ఆగస్టు 14న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టడం

ప్రతి ఒక్కరూ బడిబాట పట్టాలి

మొదటి పేజీ తరువాయి

ఇంటెలిజెన్స్, చాట్ జిపిటి యుగంలో విద్యారంగం పూర్తిగా మారబోతోందన్నారు. ఈ మార్పును ప్రతి పేదవాడికీ తీసుకురావాలని, అప్పుడే ప్రపంచాన్ని ఏలగలుగుతామని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లలు ప్రపంచాన్ని ఏలే పరిస్థితి త్వరలోనే వస్తుందని, ఆ స్థాయిలో మార్పులు జరుగుతాయని చెప్పారు. లీడర్ షిప్ క్వాలిటీస్ పెంచేలా చదువులు ఉండాలని అన్నారు. రానున్న ఏడాదిలో మరింత మంచి ఫలితాలు రావాలని ఆణిముత్యాలు కార్యక్రమం ప్రారంభిస్తున్నామని చెప్పారు.

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకుల్లో స్ఫూర్తినిచ్చేందుకు కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. విద్యార్థి ఎక్కడికి వెళ్లినా పోటీతత్వంలో నిలబడాలంటే మంచి బోధన అందించాలని తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, ఉన్నత విద్యలో బ్రిలియన్స్ అవార్డులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను సిఎం జగన్ మెడల్‌తో సత్కరించి నగదు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, ఉష శ్రీచరణ్, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపి వల్లభనేని బాలశౌరి, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనరు ఎస్ సురేష్‌కుమార్, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరిబాబు, సమగ్రశిక్ష ఎస్‌పిడి శ్రీనివాస్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి, విద్యాశాఖ సలహాదారు సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలపల్లి ప్రసాద్‌కు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును అందజేస్తున్న తెలకపల్లి రవి, అనిత తదితరులు

కార్పొరేట్ల గుప్పెట్లో మీడియా

మొదటి పేజీ తరువాయి

తేడా ఏదీ రాజ్యాంగ పరిధిలో లేదని చెప్పారు. అయితే ఆ పేరుతో ఇప్పుడు దేశంలో రాజకీయం నడుస్తోందన్నారు. ఇటువంటి రాజకీయాలకు స్వస్తి పలికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి అవసరముందని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల కృషి ఎంతగానో ఉందని చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశారని గుర్తు చేశారు. అటువంటి జర్నలిస్టులకు ఇటువంటి ప్రోత్సహకాలు అందించే కార్యక్రమాన్ని ప్రజాశక్తి నిర్వహించడం అభినందనీయమన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి తరం యువత సమాజం గురించి ఆలోచించడం మానేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్ష భావజాలమున్న యువత నేడు ఎంతో అవసరమన్నారు. నిష్పక్షపాతంగా ప్రజాసమస్యలను మీడియా వెలికితీయాలని కోరారు. మోటూరు హనుమంతరావు అవార్డు ఎంపిక కమిటీ ఛైర్మన్ తెలకపల్లి రవి మాట్లాడుతూ.. ప్రజాసమస్యలను వెలికితీసే జర్నలిస్టులకు ప్రోత్సహం అందించే ఉద్దేశంతోనే మోటూరు హనుమంతరావు అవార్డుల కార్యక్రమాన్ని ప్రతిఏటా ప్రజాశక్తి నిర్వహిస్తుందని తెలిపారు.

అవార్డులు ప్రదానం

మోటూరు హనుమంతరావు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం పుట్టపర్తిలో మంగళవారం ఉదయం జరిగింది. మోటూరు హనుమంతరావు అవార్డును నవభూమి బ్యూరో తుమ్మలపల్లి ప్రసాద్‌కు అందజేశారు. జ్ఞాపికతోపాటు శాలువకప్పి సత్కరించారు. ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసే విలేకరులకు ఇచ్చే అంతర్గత అవార్డుల ప్రదానోత్సవంలో స్టేట్ బ్యూరోకు పవన్‌కుమార్, స్టాపర్‌లో శ్రీనివాసాచారి, మండల విలేకరులలో హిందూపురం విలేకరి షబ్బీర్, ప్రకాశం జిల్లా సింగరాయకొండ విలేకరి రవికుమార్‌కు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజరు అచ్యుతరావు, అవార్డు ఎంపిక కమిటీ ఛైర్మన్ తెలకపల్లి రవి, అవార్డుల కమిటీసభ్యులు ప్రొఫెసర్ అనిత, ప్రజాశక్తి మేనేజరు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సున్నపు బట్టీలో పడి కార్మికుడు సజీవ దహనం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

సున్నపు బట్టీలో పడి కార్మికుడు సజీవ దహనమైన సంఘటన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల మండలంలోని జానపాడుకు చెందిన రాంశెట్టి చిన్నబ్రహ్మం (38) సున్నపు బట్టీల్లో కూలి పనులు చేస్తుంటారు. రోజుమాదిరిగానే తెల్లవారుజామున 4 గంటలకు పిడుగురాళ్ల పట్టణంలోని శ్రీజ కెమికల్ ఇండస్ట్రీ బట్టీలో పనికి వెళ్లారు. బట్టీలో గడ్డ కట్టిన సున్నాని పగలగొట్టే క్రమంలో అదుపు తప్పి బట్టీలో పడి మృతి చెందారు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సమాచారం. మృతుని కుటుంబానికి యాజమాన్యం రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని, పిల్లల చదువుల బాధ్యతను తీసుకోవాలని సిఐటియు నాయకులు సిహెచ్ గిరిబాబు, టి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

పరామర్శకు వెళ్లి రాజకీయాలా?

- చంద్రబాబు తీరుపై వైసిపి నేతల విమర్శలు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం ఉప్పలవారిపాలెంలో విద్యార్థి అమర్‌నాథ్ చనిపోతే పరామర్శకు వెళ్లిన చంద్రబాబు నాయుడు రాజకీయాలు మాట్లాడటం తగదని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. ఘటన జరిగిన వెంటనే బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని అన్నారు. అలాగే అమర్‌నాథ్ సోదరికి ఉద్యోగం కూడా ఇస్తామని ప్రకటించారన్నారు. నిందితులను 24 గంటల్లోనే అరెస్టు చేశామని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, తక్షణం న్యాయం జరిగేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి దోషులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో శవ రాజకీయాలు చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చాల్సింది పోయి వారింటికి వెళ్లి ఓట్లు అడుక్కునే దౌర్భాగ్య స్థితికి చంద్రబాబు దిగజారారని విమర్శించారు.

విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా

రాష్ట్ర వ్యాప్త ఐక్య ఉద్యమం

ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య ఉద్యమం నిర్వహించనున్నట్లు పట్టణ పౌర సంఘాల సమాఖ్య కన్వీనరు సిహెచ్ బాబూరావు తెలిపారు. సమాఖ్య రాష్ట్ర సమావేశం మంగళవారం వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆన్‌లైన్‌లో జరిగింది. ఈ సందర్భంగా కన్వీనరు బాబూరావు నివేదికను ప్రవేశపెట్టారు. పట్టణ ప్రజలపై విద్యుత్ భారం తీవ్రంగా ఉందని తెలిపారు. సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, అదనపు లోడ్ డిపాజిట్లు, అదనపు కస్టమర్ ఛార్జీలు వివిధ రూపాల్లో ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల కార్పొరేట్ కంపెనీలకు తప్ప ప్రజలకు ప్రయోజనం ఏమీలేదని, భారం పడుతుందని, చిరువ్యాపారుల నుండి చిన్న పరిశ్రమల వరకూ ప్రతిఒక్కరూ బాధితులేనని తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అన్ని పట్టణాల్లో వర్తక, వాణిజ్య సంఘాలు, కాలనీ అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, పౌర సంఘాలతో కలిసి జూన్ 30న రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఐక్యవేదికలు ఏర్పాటుచేసి క్షేత్రస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ వేర్వేరు రూపాల్లో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మరోసారి ఇంటి పన్నులు 15 శాతం పెంచడం దారుణమని, ఇది వరుసగా మూడో ఏడాది పెంపుదలని తెలిపారు. మరోవైపు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల కోసం భూముల విలువను పెంచిందని, దీనివల్ల ఆస్తి విలువ పెరిగి ఇంటి పన్నులు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం యూజర్ ఛార్జీలు వసూలు వేగవంతం చేసిందని, ప్రజలను బెదిరించి మరీ చెత్తపన్ను వసూలు చేస్తున్నారని విమర్శించారు. పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం, స్థానిక సంస్థలు చెత్త పన్ను వసూలు చేయడం దుర్మార్గమని తెలిపారు. ఆస్తివిలువ ఆధారిత ఇంటి పన్ను విధానం, యూజర్ ఛార్జీలు ఇతర ప్రజా వ్యతిరేక పట్టణ సంస్కరణల అంశాన్ని రాబోయే కాలంలో ప్రజా అజెండాగా మార్చాలని, ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను నిలదీయాలని కోరారు. ఆస్తిపన్ను, చెత్తపన్నుపై న్యాయ పోరాటంతోపాటు ప్రజా పోరాటాలు కొనసాగించాలని తెలిపారు. వేసవిలో మంచినీటి ఎద్దడిని అరికట్టడంలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణకు డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలకు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పాలకవర్గాలు ఏర్పడి రెండేళ్లు దాటిపోయినా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని వివరించారు. ప్రజా ప్రతినిధులను ప్రజలు నిలదీస్తున్నారని, స్థానిక సంస్థల నిధులను మళ్లిస్తూ ప్రభుత్వం ఖజానా నింపుకుంటోందని తెలిపారు. గృహ నిర్మాణం, ఇళ్లస్థలాల పంపిణీ, పట్టాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. పట్టణాల్లో టిడ్కో ఇళ్ల కేటాయింపు జరగలేదన్నారు. పేదల నుండి బలవంతంగా ఇంటి పేరుతో రూ.35 వేల నుండి లక్ష రూపాయల వరకూ వసూలు చేస్తున్నారని తెలిపారు. దశాబ్దాల తరబడి ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలను క్రబద్ధీకరించడం లేదని విమర్శిం చారు. రిజిస్ట్రేషన్లు చేయడం లేదని, జగనన్న కాలనీలు, రాజధానిలో ఇళ్ల నిర్మాణం పేరుతో పేదల ఇళ్లను తొలగించడానికి ప్రయత్నించడం శోచనీయమని అన్నారు. ఇళ్ల పట్టాలు, మౌలిక సదుపాయాల కల్పనపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.



దాణా, మొక్కజొన్న నిల్వలను పరిశీలిస్తున్న కేరళ బృందం

వల్లభ ఫీడ్స్ కంపెనీని సందర్శించిన కేరళ బృందం

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

ఫీడ్ కంపెనీల సందర్శనలో భాగంగా కేరళ బృందం మంగళవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు చేరుకుంది. పట్టణ సమీపంలోని గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిలో ఉన్న వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు చెందిన వల్లభ ఫీడ్స్ ప్రయివేటు లిమిటెడ్‌ను కేరళ పశుసంవర్ధక శాఖ మంత్రి చెంచురాణి, మరో పది మంది ఎమ్మెల్యేలు, సంబంధిత శాఖాధికారులు సందర్శించారు. వీరికి వల్లభ ఫీడ్స్ ప్రయివేటు లిమిటెడ్ ఎండి బొల్లా శ్రీనివాసరావు, వల్లభ గ్రూపు చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు స్వాగతం పలికారు. పరిశ్రమలోని దాణా కార్మాగారం, లోడింగ్ పాయింట్, లోడింగ్ విధానాన్ని కేరళ బృందానికి వివరించారు. పరిశ్రమలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని, ప్రభుత్వం తరుపున రాయితీలు ఇస్తూ సహకారం అందిస్తున్నారని తెలిపారు. అనంతరం కేరళ బృందాన్ని ఎమ్మెల్యే సత్కరించారు.

మీకు మీరే సిఎం అనుకోవడం హాస్యాస్పదం

- పవన్ కల్యాణ్‌కు ముద్రగడ లేఖ

ప్రజాశక్తి - కిర్లంపూడి (జగ్గంపేట రూరల్)

బిజెపి, టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తాయని తరచూ చెబుతూ.. తనను సిఎం చేయాలని పవన్ కల్యాణ్ ఎలా అడుగుతారని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ప్రశ్నించారు. రాష్ట్రంలోని 175 స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేసినప్పుడు తనను సిఎం చేయండి అనే పదం వాడాలని పవన్ కల్యాణ్‌కు సూచించారు. కలిసి పోటీ చేసినప్పుడు మీకు మీరే ముఖ్యమంత్రి అనుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్‌కు ముద్రగడ ఓ లేఖ రాశారు. తాను కులాన్ని అడ్డు పెట్టుకుని ఎదగలేదన్నారు. యువతను వాడుకుని, భావోద్వేగాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదన్నారు. చంద్రబాబు కాపులకు బిసి రిజర్వేషన్ ఇస్తానన్నారు కాబట్టే తాను ఉద్యమం చేపట్టానని ముద్రగడ తెలిపారు. పార్టీ యాత్రకు వచ్చిన పవన్ కల్యాణ్ భావోద్వేగ ప్రసంగాలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడిని తిట్టి సమయం వథా చేసుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వారిపై పోటీ చేసి గెలవడం ద్వారా పవన్ కల్యాణ్ తన సత్తా నిరూపించుకోవచ్చని సూచించారు. కాపు ఉద్యమాలకు సాయం చేసిన వారిని దూషించడం తగదన్నారు. ఒక పార్టీ పెట్టిన తరువాత పదిమందిని కలుపు వెళ్లాలి తప్ప వీధి రౌడీలు మాట్లాడే భాషను వాడడం సరికాదన్నారు. ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. మీ ప్రసంగాలల్లో పదేపదే నారతీస్తా, నారతీస్తా, తొక్క తీస్తా, కింద కూర్చోబెడతా, గుండు గీయిస్తా వంటి పదజాలాలు వాడుతున్నారని, ఇప్పటి వరకూ ఎంతమందికి గుండు తీయించి కింద కూర్చోపెట్టారో చెప్పాలని లేఖలో పేర్కొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఎ.గఫూర్

రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రక్తదానం మహాదానమని, రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు కాపాడాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ అన్నారు. సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు పర్స సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ శిబిరాన్ని ఎంఎ.గఫూర్ ప్రారంభించి మాట్లాడారు. సిఐట ియు అంటే పోరాటాలకే పరిమితం కాదని..సేవా కార్యక్రమాలలో కూడా భాగం పంచుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఒక వ్యక్తి రక్తదానం చేయడం వల్ల రెండు ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కెజి.గోవిందరెడ్డి సందర్శించి రక్తదానం చేస్తున్న సిఐటియు కార్యకర్తలను అభినందించారు. ఆయన మాట్లాడు తూ.. ఇటువంటి కార్యక్రమాలు సిఐటియు నాయకత్వంలో. మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, జిల్లా నాయకులు బి.రామాంజనేయులు, సిహెచ్ సాయిబాబా, విజయ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపని కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

- కార్మికశాఖ కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇంటిపని కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాష్ట్రంలో వారి కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఇంటి పనివారల కార్మిక సంఘం (సిఐటియు) కోరింది. ఈ మేరకు సంఘం కన్వీనరు దయా రమాదేవి మంగళవారం కార్మికశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్లలో పని చేయించుకునే యజమానుల పేర్లను కార్మికశాఖ కార్యాలయాల్లో నమోదు చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాల జిఓ సవరించి అమలు చేయాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, అందుకు అనుగుణంగా చట్టాన్ని సవరించాలని విజ్ఞప్తి చేశారు. నెలకు నాలుగు రోజులు వేతనంతో కూడిన సెలవులు అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఇంటి పనివారలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల కేటాయింపులో ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం కల్పించాలని, ఇంటి పనివారలందరికీ ప్రాధాన్యతనిచ్చి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. వారిపై జరుగుతున్న వేధింపులు, అవమానాలను, అక్రమ కేసులను అరికట్టాలన్నారు. ఇళ్లలో పనిచేస్తున్న సందర్భగా జరిగే ప్రమాదాలకు కార్మిక నష్ట పరిహార చట్టాన్ని వర్తింపజేయాలని రమాదేవి విజ్ఞప్తి చేశారు.



విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జగన్‌ను అరెస్టుచేస్తున్న పోలీసులు

సమస్యలు పరిష్కరించాలని ఓలా, ఉబర్ డ్రైవర్ల చలో కలెక్టరేట్

- 420 మంది అరెస్ట్, విడుదల

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఓలా, ఉబర్ డ్రైవర్లు మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టిన 'చలో కలెక్టరేట్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపవద్దంటూ పోలీసులు అభ్యంతరం తెలిపారు. అందుకు యూనియన్ నాయకులు అంగీకరించకపోవడంతో పోలీసులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. కలెక్టరేట్ వద్ద ఉద్యమానికి నాయకత్వం వహించిన యూనియన్ గౌరవాధ్యక్షులు బి జగన్‌తో సహా నాయకులు శ్రీను, చంటిని అరెస్ట్ చేసి మహారాణిపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులను, సభ్యులను పోలీసులు అరెస్టుచేశారు. మొత్తం రెండు చోట్ల కలిపి, మొత్తం 420 మందిని అరెస్ట్ చేశారు. సాయంత్రం వీరందరినీ విడిచిపెట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఓలా, ఉబర్‌లో తిరిగే కార్లు అన్నీ డ్రైవర్లవేనని, దానికై పెట్టుబడి, ఫైనాన్స్, డీజిల్ ఇన్స్యూరెన్స్ డ్రైవర్లే పెట్టుకుంటున్నారని తెలిపారు. కేవలం ఓలా, ఉబర్‌కి లింక్ అవ్వడం వల్ల 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నారని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఏదైనా సమస్యపై డ్రైవర్లు ఎవరైనా ప్రశ్నిస్తే వారి కారును ఆపేస్తున్నారని తెలిపారు. ఓలా, ఉబర్ యాజమాన్యాల అన్యాయంపై స్పందనలో జిల్లా కలెక్టర్‌కు తాము ఫిర్యాదు చేయగా, 'దీంతో మాకు ఏమిటి సంబంధం, మీరు ఓలా,ఉబర్ లింక్ అయ్యేటప్పుడు మాకు చెప్పారా?' అని ప్రశ్నించారని తెలిపారు. జిల్లాలో ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కారించాల్సిన జిల్లా కలెక్టర్, తనకు సంబంధం లేదన్నట్లు మాట్లాడటం సరికాదన్నారు.

నాబార్డు నుంచి మరో రూ.2,500 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి నాబార్డు తాజాగా మరో రూ.2,500 కోట్ల రుణాన్ని కేటాయించింది. దీనికోసం ఏయే రంగాల్లో నిధులు అవసరమవుతాయో వివరాలు ఇవ్వాలని రాష్ట్రానికి లేఖ రాసింది. ఇప్పటికే పాతిక వేల కోట్ల రుణ సాయాన్ని నాబార్డు ఖరారు చేసింది. నీటిపారుదల, వ్యవసాయ గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, తాగునీటి సరఫరా వంటి రంగాలకు నాబార్డు రుణాలు ఇస్తుంది. వీటి కోసం మార్చి వరకు రూ.25,613 కోట్లు రుణ సాయంగా అందింది. ఈ రుణాలపై బ్యాంకు వడ్డీ రేటుకన్నా తక్కువ వుంటుంది. ఈ నిధులను 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఆర్ఐడిఎఫ్-29 కింద మంజూరు చేస్తున్నట్లు నాబార్డు పేర్కొంది. ఇందుకు మూడు విభాగాల్లో 39 రంగాలను ప్రస్తావించింది.తొలి విభాగంలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన 27 అంశాలు ఉన్నాయి. రెండో విభాగంలో తాగునీరు, గ్రామీణ విద్యారంగంలో మౌలిక సౌకర్యాలు, ప్రజావైద్యం, పబ్లిక్ టాయిలెట్లు, సాలిడ్ వేస్ట్ నిర్వహణ ఉన్నాయి. మూడో విభాగంలో గ్రామీణ రోడ్లు, గ్రామీణ వంతెనలు, రైల్వే క్రాసింగ్‌లపై వంతెనలు, రోప్ వేలు ఉన్నాయి. వీటిల్లో ప్రాధాన్యతాపరంగా రుణ సాయం కోసం ప్రతిపాదనలు పంపించాలని నాబార్డు కోరింది.

సహకార మార్కెటింగ్ సొసైటీలు బలోపేతం

- వ్యవసాయశాఖ మంత్రి గోవర్ధన రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలను బలోపేతం చేయాలని అధికారులను వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి ఆదేశించారు. అందుకు తగ్గట్టు పటిష్ట కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్నారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల అధ్యక్షులు, బిజినెస్ మేనేజర్లతో కలిసి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు విస్తృత సేవలు అందించాలనే లక్ష్యంతో సహకార మార్కెటింగ్ సొసైటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. అయితే వీటి కార్యకలాపాలు క్రమంగా తగ్గిపోతూ ఉనికి కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితులను అధిగమించి రైతులకు విస్తృత సేవలు అందజేసేలా బలోపేతం చేసేయాలన్నారు. ఇందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేందుకు సహకరించాలన్నారు. సొసైటీల ఉనికిని కాపాడేందుకు వాటి ఆర్థిక కార్యకలాపాలను మెరుగుపర్చాల్సి ఉందని, ఈ అంశంపై అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. వ్యాపార కార్యకలాపాలను రైతులకు అందజేసే సేవలను విస్తృత పర్చాలన్నారు. ఎరువుల విక్రయం, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలను మెరుగుపర్చాలని, గోదాముల వినియోగాన్ని మరింతగా చేపట్టాలని చెప్పారు. సొసైటీలు వాటి వ్యాపార కార్యకలాపాలను నిర్వహించి లాభాల బాట పట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్తుల పరిరక్షణ, వాటి ద్వారా ఆదాయ వనరులను మెరుగు పర్చుకునే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సొసైటీల వ్యాపార కార్యకలాపాలు, వాటి ఆర్థిక స్థితి తదితర అంశాలపై సహకారశాఖ కమిషనర్ అహ్మద్‌బాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమీక్షలో సహకార, మార్కెటింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, మార్క్‌ఫెడ్ ఎమ్‌డి రాహుల్ పాండే, ఛైర్మన్ నాగిరెడ్డి, సహకారశాఖ సలహాదారులు బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మలబార్ గోల్డ్ ప్రచారకర్తగా జూనియర్ ఎన్‌టిఆర్

హైదరాబాద్ : ప్రముఖ ఆభరణాల రిటైల్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ బ్రాండ్ అంబాసీడర్‌గా మరోసారి ప్రముఖ నటుడు జూనియర్ ఎన్‌టిఆర్ నియమితులయ్యారు. తమ ప్రచారకర్తగా ఎన్‌టిఆర్‌కు తిరిగి స్వాగతం పలుకుతున్నామని ఆ సంస్థ పేర్కొంది. ఆయన నియామకం సంస్థ 30వ వార్షికోత్సవ మెరుపులు రెట్టింపు చేయడానికి దోహదం చేయనుందని మలబార్ గోల్డ్ ఆశాభావం వ్యక్తం చేసింది.

ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్‌గా ఎస్‌బిఐ ఎమ్‌డి జానకిరామన్



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ గవర్నర్‌గా ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టర్ స్వామినాథన్ జానకిరామన్ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన ఈ హోదాలో కొనసాగుతారని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ మహేశ్ కుమార్ జైన్ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. దీంతో ఆ స్థానంలో జానకిరామన్‌ను నియమించారు. ప్రస్తుతం ఆర్‌బిఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ ఉండగా.. డిప్యూటీ డైరెక్టర్లుగా మైఖెల్ పాత్ర, ఎం రాజేశ్వరరావు, టి రవిశంకర్ ఉన్నారు.

గ్రేట్ ప్లేస్ టు వర్క్‌లో సింక్రోనీకి ఐదో స్థానం

హైదరాబాద్ : పని చేసేందుకు అత్యుత్తమ కంపెనీలో ఒక్కటిగా తమ సంస్థ నిలిచిందని ప్రీమియర్ కన్స్యూమర్ ఫైనాన్సియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ వెల్లడించింది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా జాబితాలో తమ సంస్థ ఐదో స్థానం దక్కించుకుందని పేర్కొంది. తమ ఉద్యోగులకు సమ్మిళిత, మద్దతుతో కూడిన, స్ఫూర్తిదాయక వాతావరణం అభివృద్ధి చేయడంలో సింక్రోనీ రాజీలేని నిబద్ధతకు ఇది ప్రతీకగా నిలుస్తుందని తెలిపింది. తమ సంస్థలో 50 శాతం మహిళా ప్రాతినిధ్యం కలిగి ఉండటంతో పాటుగా 100 మంది వికలాంగులు ఉన్నారని సింక్రోని ఇండియా బిజినెస్ లీడర్ ఆండీ పొన్నేరీ పేర్కొన్నారు.

జగన్ పాలనలో దాడులు, దౌర్జన్యాలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - పత్తికొండ (కర్నూలు)

జగన్మోహన్ రెడ్డి పాలనలో దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు పెట్రేగిపోతున్నాయని, అసలు పోలీసు వ్యవస్థ పని చేస్తుందా అనే అనుమానం వస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు.కర్నూలు జిల్లా పత్తికొండలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బాపట్లలో పదవ తరగతి విద్యార్థి అమర్నాథ్ హత్య, విశాఖలో ఎంపి భార్య, కొడుకు కిడ్నాప్, కడపలో దళిత డాక్టర్ అచ్చన్న హత్య, సిఎం సొంత నియోజకవర్గం పులివెందులలో దళిత మహిళలపై అత్యాచారం, హత్య తదితర ఘటనలను సిఎం జగన్ ఖండించకపోగా, డిజిపి మాత్రం లా అండ్ ఆర్డర్ బాగుందని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పత్తికొండలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రాజేష్ గౌడ్ పై దాడి చేయడమే కాకుండా అక్రమంగా కేసులు బనయించడాన్ని తీవ్రంగా ఖండించారు.రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులు, దోపిడీలపై ఈనెల 22న సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు కలిసి రావాలని కోరారు.

ఐఐటి బాంబేకు రూ.315 కోట్ల విరాళం

- ప్రకటించిన నందన్ నిలేకని



ముంబయి : దిగ్గజ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు, ఆధార్ ఆవిష్కర్త నందన్ నిలేకని తాను చదువుకున్న ఐఐటి బాంబేకు ఏకంగా రూ.315 కోట్ల భారీ విరాళం అందించారు. ఈ నిధులను ఆ విద్యా సంస్థలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు, ఇంజినీరింగ్, టెక్నాలజీలో పరిశోధనలు వంటి వాటికి వినియోగించాలని ఆయన సూచించారు. 1973లో ఐఐటి బాంబేలో ఆయన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో డిగ్రీ పూర్తి చేశారు. ఇది వరకు కూడా నిలేకని ఆ సంస్థకు రూ.85 కోట్ల విరాళం ఇచ్చారు. ఐఐటి బాంబేతో 50 ఏళ్ల అనుబంధం కలిగి ఉన్నారు.

గ్రేట్ ప్లేస్ టు వర్క్‌లో సింక్రోనీకి ఐదో స్థానం

హైదరాబాద్ : పని చేసేందుకు అత్యుత్తమ కంపెనీలో ఒక్కటిగా తమ సంస్థ నిలిచిందని ప్రీమియర్ కన్స్యూమర్ ఫైనాన్సియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ వెల్లడించింది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా జాబితాలో తమ సంస్థ ఐదో స్థానం దక్కించుకుందని పేర్కొంది. తమ ఉద్యోగులకు సమ్మిళిత, మద్దతుతో కూడిన, స్ఫూర్తిదాయక వాతావరణం అభివృద్ధి చేయడంలో సింక్రోనీ రాజీలేని నిబద్ధతకు ఇది ప్రతీకగా నిలుస్తుందని తెలిపింది. తమ సంస్థలో 50 శాతం మహిళా ప్రాతినిధ్యం కలిగి ఉండటంతో పాటుగా 100 మంది వికలాంగులు ఉన్నారని సింక్రోని ఇండియా బిజినెస్ లీడర్ ఆండీ పొన్నేరీ పేర్కొన్నారు.

ఈ ఏడాది 28 బిలియన్ల ఫార్మా ఎగుమతులు

- గతేడాది ఆశించిన స్థాయిలో నమోదు కాలేదు
- ఫార్మాగ్జిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ్ వెల్లడి
- వచ్చే నెలలో అంతర్జాతీయ ఎగ్జిబిషన్



హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 28 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.30 లక్షల కోట్లు) విలువ చేసే ఔషధ ఉత్పత్తుల ఎగుమతులు అంచనా వేస్తున్నామని ఫార్మాగ్జిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ్ భాస్కర్ అన్నారు. 2022-23లో 3.25 శాతం వృద్ధితో 25.39 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయన్నారు. తొలిసారి 25 బిలియన్ల మార్కును చేరుకున్నప్పటికీ.. పరిశ్రమ ఇంతకంటే ఎక్కువ 27 బిలియన్లుగా అంచనా వేసిందన్నారు. ముఖ్యంగా ఆఫ్రికా, సిఐఎస్ దేశాలకు చేసే ఎగుమతుల్లో ప్రతికూల వృద్ధి చోటు చేసుకుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఫార్మాగ్జిల్ రెగ్యులేటరీ ఎఫైర్స్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్న చుండుతో కలిసి ఉదయ్ భాస్కర్ మీడియాతో మాట్లాడారు. గతేడాది దేశంలో ప్రస్తుతం 50 బిలియన్ డాలర్ల విలువ చేసే ఔషధ ఉత్పత్తులు నమోదయ్యాయన్నారు. ఇందులో సగం ఎగుమతులు జరగడం విశేషమన్నారు. ఈ రంగం ఎగుమతుల్లో తెలుగు రాష్ట్రాల వాటా అత్యంత కీలకంగా ఉందన్నారు. గ్లోబల్ ఎగుమతుల్లో విలువ పరంగా భారత్ 11వ స్థానంలో, సంఖ్య పరంగా 3వ స్థానంలో ఉందన్నారు. గ్లోబల్ టాప్ 25 ఫార్మా కంపెనీల్లో ఎనిమిది భారత్‌కు చెందినవేనని అన్నారు. ఔషధ ముడి సరుకుల ఎగుమతుల్లో చైనా అగ్రస్థానంలో ఉందన్నారు. ఆ దేశం దాదాపుగా 1.73 ట్రిలియన్ డాలర్ల ఫార్మా ఎగుమతులు చేస్తోందన్నారు. ఇతర దేశాలతో పోల్చితే ఇది చాలా ఎక్కువన్నారు. మొత్తం ప్రపంచానికి కావాల్సిన ఎపిఐ, ఇంటర్మీడియట్ ముడి సరుకుల ఎగుమతుల్లో చైనా ఏకంగా 65-70 శాతం వాటా కలిగి ఉందన్నారు. దిగుమతులను తగ్గించుకోవడానికి భారత్ పిఎల్ఐ స్కీమ్ కింద ప్రోత్సాహకాలు ఇస్తున్నప్పటికీ పెద్ద పురోగతి కనబడటం లేదన్నారు. స్వల్పంగా మాత్రమే దిగుమతులు తగ్గాయన్నారు.

మూడు రోజులు ఫార్మా ఎగ్జిబిషన్

జులై 5,7,8 తేదిల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ ఫార్మా ఎగ్జిబిషన్ (ఐపెక్స్) 9వ ఎడిషన్ వివరాలను రవి ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. దీనికి 120 దేశాల దిగుమతి, ఎగుమతి దారులు సహా 3500 మంది ఎగ్జిబిటర్లు, 4500 మంది విదేశీ ప్రతినిధులు, లక్షకు పైగా సందర్శకులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ ప్రదర్శన వ్యాపారాన్ని పెంచుకునేందుకు ప్రపంచ దేశాల సాంకేతికతను పంచుకునేందుకు విస్తృత అవకాశాలు కల్పిస్తుందన్నారు.


సంపాదకీయం

మణిపూర్ మండుతోంది

మెయితే, కుకీ తెగల మధ్య బిజెపి ప్రభుత్వం రగిలించిన చిచ్చు మణిపూర్‌ను నేడు నిలువునా దహించివేస్తోంది. యాభై రోజులైనా మంటలు ఆరలేదు. ఆర్మీ, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, అస్సాం రైఫిల్స్‌ను రంగంలోకి దింపినా పరిస్థితి అదుపులోకి రాకపోగా, రోజురోజుకీ మరింతగా దిగజారుతోంది. కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి రాజ్ కుమార్ రంజన్ సింగ్ ఇంటికి నిప్పుపెట్టారు. ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేల ఇళ్లను తగులబెట్టారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, బీరేన్‌సింగ్ కేబినెట్‌లో నెంబర్ టూ గా ఉన్న వ్యక్తి ఇంటికి కూడా నిప్పుపెట్టే యత్నం చేశారు, మణిపూర్‌లో శాంతిభద్రతలు ఎంత అధ్వానంగా ఉన్నాయో ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఈ మత మారణ హోమంలో ఇంతవరకు 120 మంది హతులయ్యారు. నాలుగువేలకుపైగా ఇళ్లు తగలబడ్డాయి. 60 వేల మంది నిరాశ్రయులయ్యారు. ఏ క్షణంలో దాడి జరుగుతుందో అని ప్రాణభయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. బతుకు జీవుడా అంటూ. వేలాదిమంది ఇతర రాష్ట్రాలకు వలసపోయారు. ఆహార ధాన్యాలు, నిత్యావసరాలు దొరక్క ఆకలితో అలమటించడం, వైద్యం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోవడం నిత్యకృత్యమైంది. ప్రధాని చెప్పే డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వస్తే జరిగేది వికాస్ కాదు, వినాశనమేననడానికి మణిపూర్ మారణకాండ ఒక తిరుగులేని ఉదాహరణ. మణిపూర్ సంక్షోభానికి ఒక దారి చూపండని కేంద్రాన్ని కోరేందుకు ఆ రాష్ట్రం నుంచి వెళ్లిన ప్రతిపక్ష నేతల బృందం ఢిల్లీలో పది రోజులుగా పడిగాపులు కాస్తున్నా ప్రధాని అపాయింట్‌మెంట్ దొరకలేదు. మణిపూర్ మండుతుంటే దానికి పరిష్కారం చూపకుండా ప్రధాని మోడీ అమెరికా యాత్రకు వెళ్లడం పలు విమర్శలకు దారితీసింది.

పక్షపాత రహితంగా పాలన సాగిస్తామంటూ ప్రమాణం చేసిన పాలక పార్టీలు రాజకీయ ప్రయోజనాలే ప్రాతిపదికగా మతతత్వ విషాన్ని, జాతుల మధ్య వైరాన్ని పెంచి పోషిస్తే చోటుచేసుకునే అంతులేని హింసకు తార్కాణమే మణిపూర్. మెయితే ఓటు బ్యాంకును కాపాడుకోవడం, హిందూ మతతత్వాన్ని పెంచి పోషించి మత విభజనను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని బీరేన్‌సింగ్ ప్రభుత్వం, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయి. అందుకోసమే రాష్ట్రంలోని మెజారిటీ వర్గమైన మెయితేలకు ఎస్‌టి రిజర్వేషన్లు కల్పించేందుకు శతవిధాలా ప్రయత్నించింది. మెయితేలను ఎస్‌టి జాబితాలో చేర్చే ప్రక్రియపై నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్రప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వారికి రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా కొండ ప్రాంతాల్లోని తమ భూములు కొల్లగొడితే, ఉద్యోగాలు ఎగరేసుకుపోతే తమ గతేంటంటూ గళమెత్తిన కుకీలపై బీరేన్‌సింగ్ సర్కారు మద్దతున్నట్లు భావిస్తున్న గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరపడంతో మొదలైన ఈ హింసాకాండ రావణకాష్టంలా నేటికీ మండుతూనే ఉంది. మెయితేలు అధికంగా ఉండే ఇంఫాల్ లోయ నుంచి కుకీలు, నాగాలు తదితర ఆదివాసీలు, కొండ ప్రాంతాల నుంచి మెయితేలు వలసపోతున్నారు. మెయితేలలో అత్యధికులు హిందువులు, కుకీ తదితర గిరిజన తెగల్లో అత్యధికులు క్రైస్తవులు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ పేరుతో ఇంఫాల్‌లో అనేక చర్చిలను బిజెపి ప్రభుత్వం కూల్చేసింది. అనంతర హింసాకాండలో గతంలో ఎన్నడూ లేనివిధంగా వందలాది చర్చిలతోసహా ఆసుపత్రులు, అంబులెన్సులు సైతం నిత్యం తగలబడుతూనే ఉన్నాయి. వైద్యం అందక చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. పరస్పర విద్వేష విషం ఎంతగా పాకిందంటే తమ ప్రత్యర్థులకు ఆహారం, తాగునీరు సైతం అందకుండా చేసేవరకూ. మణిపూర్ రైఫిల్స్ నుంచి, పోలీసుల నుంచి ఎత్తుకెళ్లిన ఆయుధాల్లో ఎక్కువ భాగం మెజార్టీ తెగ అయిన మెయితేల వద్దే ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. 'ఆ ఆయుధాలను దయుంచి తిరిగి ఇచ్చేయండి' అంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దీనంగా చేస్తున్న విజ్ఞప్తులు బిజెపి ప్రభుత్వ అసమర్థ పాలనకు ఓ మచ్చుతునక. మంటలు చెలరేగిన 25 రోజుల తరువాత తీరిగ్గా అక్కడికి వెళ్లిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 15 రోజుల్లో పరిస్థితులన్నీ చక్కబడతాయని హామీ ఇచ్చి వచ్చారు. ఆ తరువాత హింస పెరిగిందే తప్ప తగ్గలేదు. మెయితేలకు బీరేన్‌సింగ్ ప్రభుత్వం కొమ్ముకాస్తుండటంతో గవర్నర్ నేతృత్వంలోని శాంతి కమిటీకి సహకరించేందుకు కుకీలు నిరాకరించారు. ప్రభుత్వం మీద తమకు నమ్మకం పోయిందని కుకీలు అంటుంటే, కుకీలను అదుపు చేయడంలో ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించలేకపోతోందని మెయితేలు విమర్శిస్తున్నారు. కేంద్రంలోను, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న సంకుచిత మతతత్వ ధోరణే ఈ సమస్యకు మూలం. వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఈశాన్య ప్రాంతంలో అశాంతి దేశ సమైక్యత సమగ్రతలకు ముప్పుగా మారక ముందే మణిపూర్ సమస్యకు ఒక పరిష్కారం చూపాలి.

మహనీయుల మాట



చరిత్ర నిర్మించేది రాజులూ సైనిక జనరల్సూ కాదు. ప్రజలే.

- నెల్సన్ మండేలా,
దక్షిణాఫ్రికా జాతిపిత.

యువత నైపుణ్య కొరతకు కారకులెవరు?

విశ్లేషణ

మన దేశంలో 2030 నాటికి సుమారు 2 కోట్ల 90 లక్షల మంది యువత సరైన నైపుణ్యం లేక ఉపాధికి దూరమవుతారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) తాజా నివేదిక పేర్కొంది. ప్రపంచ జనాభాలో భారత దేశానిది అగ్రస్థానం. కేవలం సంఖ్యలోనే కాదు, యువశక్తిలో కూడా భారత దేశానిదే ప్రథమ స్థానం. దేశ జనాభాలో 45 శాతం ప్రజలు 25 సంవత్సరాల లోపు వారే. 2025 నాటికి మన దేశ సగటు మధ్యస్థ వయసు 31 సంవత్సరాలుగా వుంటుందని అంచనా. ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలు కలిగిన ఐదు దేశాలతో పోలిస్తే అత్యంత యువశక్తి కలిగిన దేశంగా మన దేశం వుంటుంది. అయితే ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోతున్నది. 2023 మార్చి లెక్కల ప్రకారం దేశంలో గత 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగ రేటు 7.76 శాతంగా వుంది. ఇది పట్టణాల్లో 8.3, గ్రామాల్లో 7.3 శాతం. చదువుకున్న వారి సంఖ్య పెరగడం వల్ల ఏర్పడిన నిరుద్యోగం కాదు. మన చదువులు సరైన నైపుణ్యత నేర్పకపోవడం వల్ల, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల పెరుగుతున్న నిరుద్యోగం. మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందివ్వకపోతే యువత శక్తి నిర్వీర్యం అవుతుంది. మతతత్వ, విచ్ఛిన్నకర శక్తుల చేతిలో పదునైన ఆయుధంగా మారుతుంది. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన అనేక నినాదాల్లో 'నైపుణ్య భారతం' ఒకటి. 2022 నాటికి 40 కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే లక్ష్యంతో 2015లో కేంద్ర ప్రభుత్వం స్కిల్ ఇండియా మిషన్ ఏర్పాటు చేసింది. ప్రారంభించిన నాడు చేసిన హంగామా తప్ప ఆచరణలో ఏ ప్రయోజనం జరగలేదు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా నైపుణ్యం కోసం గ్లోబల్ విద్య అందిస్తామని ఇటీవలే నిపుణుల కమిటీ వేశారు. ఈ కమిటి నెల రోజుల లోపే నివేదిక ఇవ్వాలని గడువు నిర్ణయించారు. యువతలో నైపుణ్యాన్ని పెంచాలనే చిత్తశుద్ధి కంటే ఎన్నికల్లో యువత ఓట్లు కొల్లగొట్టడానికి, దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీల్లో పని చేయడానికి అవసరమైన కొద్దిమంది నిపుణులను తయారు చేయడానికి పాలకులు అనేక ఆకర్షణీయమైన పథకాలు ప్రకటిస్తున్నారు.



వి. రాంభూపాల్

యువ భారతం

జనాభాలో చైనాను అధిగమించి అత్యధిక జనాభా వున్న దేశంగా అగ్రస్థానం పొందాము. దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతామని బిజెపి నేతలు ఊదరగొడుతుంటే ఈ రంగంలోనైనా అగ్రస్థానం లోకి వచ్చాములే అని నెటిజన్‌లు ఎత్తిపొడుస్తున్నారు. వాస్తవానికి ప్రపంచంలో అత్యధిక యువశక్తి వున్న దేశం మనదే. మొత్తం జనాభాలో 65 శాతం 28 సంవత్సరాల లోపు వుండగా, అందులో 25 సంవత్సరాల లోపు వున్నవారు 45 శాతం మంది వున్నారు. 2050 నాటికి కూడా మన దేశ మధ్యస్థ సగటు వయసు 38 సంవత్సరాలు మాత్రమే. అప్పటికి అమెరికా సగటు మధ్య వయసు 40 నుండి 42 సంవత్సరాలు, చైనా 39 నుండి 44 సంవత్సరాలుగా వుంటుంది. రాబోయే 15-20 సంవత్సరాల మధ్య ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక యువ కార్మికశక్తి నాలుగు శాతం తగ్గుతుండగా, మన దేశంలో 32 శాతం పెరిగి, ప్రతి సంవత్సరం కొత్తగా ఒకటిన్నర కోటి మంది లేబర్ మార్కెట్‌లో పని చేయడానికి సిద్ధమవుతున్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే సహజ వనరులతో పాటు మానవ వనరులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. మన దేశంలో సహజ వనరులు, సమశీతోష్ణ వాతావరణం, అన్నిటికంటే ముఖ్యంగా అతి పెద్ద సంఖ్యలో యువశక్తి వుండడం ప్రపంచ ఆర్థికశక్తిగా ఎదగడానికి గొప్ప అవకాశం. వీరికి సరైన విద్య, శిక్షణ కల్పించి నైపుణ్యాన్ని పెంచితే దేశం అభివృద్ధి చెందుతుంది. తమ భవిష్యత్తుకు భరోసా కావాలని యువత కోరుకుంటున్నారు. అందుకే ఎన్నికల్లో ఎక్కువ మంది యువతీ యువకులు ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. 2014లో బిజెపి అధికారంలోకి రావడంలో మొదటిసారి ఓటు హక్కు పొందిన యువతలో 87 శాతం మంది ఆ పార్టీకి ఓటు వేశారు. వివిధ రాష్ట్రాల్లో బిజెపి సాధించిన ఎన్నికల విజయాల్లో యువత ఓటింగ్ కీలకమైంది. మన రాష్ట్రంలో గత ఎన్నికల్లో మొదటిసారి ఓటు పొందిన యువకులు అత్యధికం వైసిపికి వేశారు. అధికారంలోకి రావాలనుకుంటున్న తెలుగుదేశం పార్టీ యువగళం పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నది. ఎన్నికలు దగ్గరకు వచ్చేకొద్దీ దేశంలో, రాష్ట్రంలో యువతకు అనేక హామీలు వరదల్లా చుట్టుముట్టనున్నాయి. పాలక పార్టీలకు ఓట్లు, సీట్లు తప్ప యువశక్తికి అవసరమైన నైపుణ్యాన్ని అందించాలనే ప్రయత్నం మాత్రం చాలా స్వల్పం.



కొద్దిమందికి మాత్రం అత్యంత ఆధునిక విద్య, కోట్లాది మందికి ప్రాచీనకాలం నాటి వర్ణ వ్యవస్థను బలపరచే అశాస్త్రీయ విద్యను అందించాలని బిజెపి నేతలు భావిస్తున్నారు. ఆటోమేషన్ వంటి అనేక నూతన శాస్త్రీయ పరిశోధనలు ప్రపంచాన్ని అబ్బుర పరుస్తుంటే...జ్యోతిష్యం, భూతవైద్యం అంటూ కొన్ని శతాబ్దాల నాటి విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. యువ శ్రామికశక్తిలో 70 శాతం గ్రామీణ ప్రాంతం నుండి వస్తున్నారు. వీరికి వృత్తిశిక్షణ, ఐటిఐ, పాలిటెక్నిక్ లాంటివి అందుబాటులో వుంచి నైపుణ్యాన్ని పెంచాలి. స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, గ్లోబల్ విద్య అంటూ చేస్తున్న ఉత్తుత్తి ప్రచారం ఎన్నికల్లో కొద్దికాలం ఓట్లు రాల్చవచ్చునేమో కాని యువత భవితకు ఏ మాత్రం ఉపయోగపడదు. రాజ్యాంగం హామీ ఇచ్చిన శాస్త్రీయమైన, నైపుణ్యవంతమైన విద్యా విధానం అందరికీ కావాలి.

నైపుణ్య కొరతలో యువశక్తి

పనుల కోసం రాష్ట్రాలు దాటి వలసలు వెళ్తున్న యువకుల్లో అత్యధికమంది ఇంటర్, డిగ్రీ చదివినవారు లేదా ఆ స్థాయి చదువులు మధ్యస్తంగా ఆపేసినవారు. భవన నిర్మాణ కార్మికులుగా మహా నగరాలకు పెద్ద ఎత్తున వలసలు పోతున్నారు. ఈ యువ కార్మికులు ఎంతటి దుర్భర పరిస్థితుల్లో వున్నారో తెలుసుకోవడానికి భువనేశ్వర్ నుండి యశ్వంత్‌పూర్ వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, హౌరా నుండి గోవా వెళ్లే వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైళ్లను చూస్తే అర్థమవుతుంది. రిజర్వేషన్ కోచ్‌లలో సైతం కిక్కిరిసి, అలసిపోయి, రెండు మూడు రోజులుగా స్నానాలు చేసే అవకాశం లేని ఆ యువతీ యువకులంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అక్షరాస్యులు. వీరిలో అత్యధికులు స్వంత భూములు లేనివారు, సామాజికంగా అట్టడుగు వర్గాలకు చెందినవారు. కాంట్రాక్టర్ల మోసాలు, యజమానుల వేధింపులు, మహిళలకు జరుగుతున్న అవమానాలు తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయులు. స్వంత అనుభవంతో భవన నిర్మాణ పనులు నేర్చుకొని అద్భుతమైన ప్రతిభతో సుందర భవనాలను నిర్మిస్తున్న కార్మికులు వీరు. వీరికి నైపుణ్య శిక్షణ ఇచ్చి వృత్తి అవకాశాలు కల్పించాలనే స్పృహ పాలకులకు ఏ మాత్రం లేకపోగా, నైపుణ్యం లేని కార్మికుల పేరుతో మరింతగా దోచుకోవడానికి సంపన్నులకు పాలక పార్టీలు తోడ్పడుతున్నాయి. డిగ్రీ, పీజీలు చేసిన వారిలో సగం మందికి నైపుణ్యత లేదని అందువల్ల ఉద్యోగాలు పొందలేకపోతున్నారని అనేక గణాంకాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ఇటీవల ప్రకటించిన నివేదిక సారాంశం కూడా ఇదే.

కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ 2021 నివేదిక ప్రకారం విద్యావంతుల్లో ఉద్యోగార్హత కలిగినవారు కేవలం 50 శాతం లోపు మాత్రమే వున్నారు. బి.టెక్ 47 శాతం, 47 ఎం.బి.ఎ, 43 బి.ఎ, 40 శాతం బి.కాం, 30 శాతం బి.ఎస్సీ విద్యార్థులకు మాత్రమే ఉద్యోగ నైపుణ్యత ఉన్నట్లు తెలిపింది. బి.ఫార్మసీ చదివిన వారిలో నిరుద్యోగం 67 శాతంగా వుంది. ఐటిఐ లలో చదువుకున్న వారిలో 75 శాతం మందికి ఉపాధి నైపుణ్యాలు లేవని ఇండియా స్కిల్ రిపోర్టు పేర్కొంది. 1951 నాటికి మన దేశ అక్షరాస్యత కేవలం 16.7 శాతం. 72 సంవత్సరాల స్వదేశీ పాలన తర్వాత నూటికి 64 శాతం మందికి ఎంతో కొంత చదువు దక్కింది. అయితే డిగ్రీలు చదివిన విద్యావంతుల్లోనే సగం మందికి సరైన నైపుణ్యత లేకపోతే అంతకంటే దిగువ చదువుల నాణ్యత ఏమిటి? నైపుణ్యాన్ని అందించలేని చదువులతో ఆధునిక ప్రపంచంతో ఎలా పోటీ పడగలం? ఇంటర్, డిగ్రీ స్థాయిలలో మంచి మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నప్పటికి ఎందుకని ఉద్యోగ నైపుణ్యత సాధించలేకపోతున్నారు?

అధ్యాపకుల కొరత

ప్రభుత్వాల విధానాలు, ప్రచార హోరు, మధ్యతరగతి ఆశల మధ్య దేశవ్యాప్తంగా విద్యా ప్రైవేటీకరణ వేగంగా విస్తరిస్తున్నది. అయితే ఇక్కడ చదువులు నేర్పుతున్న అధ్యాపకుల్లో ఎంతమంది అర్హత కలిగిన వారు వున్నారనేది ప్రశ్నార్థకం. 2021 ఐక్యరాజ్యసమతి ఆధ్వర్యంలోని యునెస్కో భారతదేశ విద్యపై ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రైవేట్ విద్యాలయాల్లో అర్హత లేని అధ్యాపకులు నర్సరీ స్థాయిలో 51 శాతం, ప్రాథమిక స్థాయిలో 41 శాతం, ప్రాథమికోన్నత స్థాయిలో 55, సెంకడరీ స్థాయిలో 52, ఉన్నత విద్యలో 61 శాతం మంది వున్నారు. విద్యా పునాది నుండే అధ్యాపకుల పరిస్థితి ఇలా వుంటే నాణ్యమైన విద్య ఎలా వస్తుంది? నైపుణ్యత ఎక్కడి నుండి అందుతుంది? ఉన్నత విద్యా కేంద్రాలైన యూనివర్శిటీలలో ప్రొఫెసర్ల కొరత చాలా తీవ్రంగా వుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 59 శాతం ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా వున్నట్లు సమాచార హక్కు చట్టం ద్వారా ఎస్.ఎఫ్.ఐ అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాధానం ఇది. కొత్తగా ప్రారంభించిన కేంద్రీయ విశ్వవిద్యాలయాల పరిస్థితి అతిథి అధ్యాపకులు, అద్దె భవనాలుగా వుంది. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యా కేంద్రాలుగా భావిస్తున్న ఐఐటి లలో కూడా సిబ్బంది కొరత వుంది. 23 ఐఐటి లలో మంజూరైన పోస్టులు 10,881 కాగా... 4,370 పోస్టులు భర్తీ చేయాల్సి వుందని పార్లమెంట్‌కు ఈ ప్రభుత్వం తెలిపింది. ఉన్నత విద్యారంగం ఇంత అధ్వాన్నంగా వుంది కాబట్టే విశ్వవిద్యాలయాల అంతర్జాతీయ ర్యాంకుల స్థానాల్లో దేశీయ విశ్వవిద్యాలయాలు పదిలో ఒకటి కాదు, వందలో ఒకటి కూడా వుండడంలేదు. రాజకీయ ప్రచారం కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ఇది పరిష్కారం కాదు. మన యువత నైపుణ్య కొరతకుగల కారణాలను నిష్పక్షపాతంగా పరిశీలించి శాస్త్రీయ పరిష్కార చర్యలు తీసుకోవాలి. అప్పుడే మన దేశం రానున్న కొన్ని దశాబ్దాల్లోనైనా ప్రపంచ అగ్ర దేశాలతో పోటీ పడగలదు.

కేంద్ర ప్రభుత్వ తిరోగామి విధానాలు

ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి ఉన్నత విద్యాలయాల వరకు సరిపడ అధ్యాపకులు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, మౌలిక సౌకర్యాలు అందుబాటులో లేకపోతే యువతకు నిపుణత ఎలా అందుతుంది? విద్యారంగాన్ని మెరుగుపరచి నైపుణ్యాన్ని పెంచడం కంటే కేంద్రీయ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేయడం, పోలీసులు, గూండాల ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల మీద దాడులు చేయించడం, మైనారిటీ అమ్మాయిలు ధరించే హిజాబ్ లాంటివి వివాదం చేయడం, వైస్ ఛాన్సలర్ల ద్వారా నిర్బంధ విధానాలు అమలు చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకు పాఠ్యాంశాలను బిజెపి మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనలకు అనుగుణంగా మారుస్తున్నారు. కొద్దిమందికి మాత్రం అత్యంత ఆధునిక విద్య, కోట్లాది మందికి ప్రాచీనకాలం నాటి వర్ణ వ్యవస్థను బలపరచే అశాస్త్రీయ విద్యను అందించాలని బిజెపి నేతలు భావిస్తున్నారు. ఆటోమేషన్ వంటి అనేక నూతన శాస్త్రీయ పరిశోధనలు ప్రపంచాన్ని అబ్బుర పరుస్తుంటే...జ్యోతిష్యం, భూతవైద్యం అంటూ కొన్ని శతాబ్దాల నాటి విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. యువ శ్రామికశక్తిలో 70శాతం గ్రామీణ ప్రాంతం నుండి వస్తున్నారు. వీరికి వృత్తిశిక్షణ, ఐటిఐ, పాలిటెక్నిక్ లాంటివి అందుబాటులో వుంచి నైపుణ్యాన్ని పెంచాలి. స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, గ్లోబల్ విద్య అంటూ చేస్తున్న ఉత్తుత్తి ప్రచారం ఎన్నికల్లో కొద్దికాలం ఓట్లు రాల్చవచ్చునేమో కాని యువత భవితకు ఏ మాత్రం ఉపయోగపడదు. రాజ్యాంగం హామీ ఇచ్చిన శాస్త్రీయమైన, నైపుణ్యవంతమైన విద్యా విధానం అందరికీ కావాలి.

(వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు)

జనవాక్యం

ఎస్.ఎం.ఎస్ చార్జీల మోత

ఈ మధ్య బ్యాంకులవారు ఎస్.ఎం.ఎస్ చార్జీల మోత మోగించడం మరీ ఎక్కువైంది. దీంతో ఎందుకు తమ బ్యాంకు ఖాతా లోని డబ్బు మాటిమాటికీ కోత పడుతున్నదో తెలియని ఆగమ్యగోచర పరిస్థితుల్లో ఖాతాదారులు కొట్టుమిట్టాడు తున్నారు. ఇంట్లో డబ్బు పెట్టుకుంటే రక్షణ సమస్య. అదే బ్యాంకులో వేసుకుంటే ఇలా తమ బ్యాంకు ఖాతా లోని డబ్బు కేంద్ర ప్రభుత్వం వారు అనుసరిస్తున్న కొన్ని అర్థం, పర్థం లేని అస్తవ్యస్థమైన విధానాలతో ఖాతాదారుల పాలిట పెనుశాపంగా పరిణమిస్తున్నది. దీంతో ప్రజల పరిస్థితి ముందు నొయ్యి వెనుక గొయ్యిలా తయారయ్యింది. ఏదిఏమైనా కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కొన్ని ప్రజావ్యతిరేక నిర్ణయాల మూలాన బ్యాంకులలో డబ్బులు డిపాజిట్ చేయాలంటేనే ప్రజలు ఒక విధమైన అభద్రతాభావానికి గురవుతున్నారు. బ్యాంకుల ద్వారా కేంద్రప్రభుత్వం ఇలా ప్రజలను నానా రకాలుగా ఇబ్బంది పెట్టేలా వ్యవహరించడం ఈ దేశ ప్రజలకు గుదిబండలా పరిణమించింది.

- బుగ్గన మధుసూదనరెడ్డి,
బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

ప్రయోజనం శూన్యం

ముఖ్యమంత్రి గారు బటన్ నొక్కగానే ఖాతాలో డబ్బులు పడ్డాయేమో అని పేద ప్రజలు బ్యాంకుల చుట్టూ పనులు మానుకుని తిరుగుతున్నారు! అటు బ్యాంకు సిబ్బందికి సమాధానం చెప్పడం పెద్ద సమస్యగా మారింది. ఇచ్చే అరకొర పరిహారానికి రైతులు నెలల తరబడి బ్యాంకుల చుట్టూ తిరగడం చాలా బాధాకరం! ఈ బటన్ నొక్కుడు (ఉత్తుత్తి) కార్యక్రమాలకు, ప్రచారానికి ప్రజాధనం ఎంతో ఖర్చు పెడుతున్నారు. లబ్ధి పొందుతున్న మహిళలు, వృద్ధులను బలవంతంగా తరలిస్తున్నారు. తాను చేస్తున్న మేలు ఏమిటో చెప్పకుండా కేవలం ప్రతిపక్షాల వారిని కించపరిచే వ్యాఖ్యలు చేయడం వల్ల ఒనగూడే ప్రయోజనం శూన్యం!

- జి.ఆర్,
ముస్తాబాద, కృష్ణా జిల్లా.

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

ప్రస్తుతం ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగి పోయింది. జనాభా పెరిగిపోవడం వల్ల నివాసాలు, పంట పొలాలు ఏర్పాటు చేసుకోవడానికి, విలువైన ఖనిజాల కోసం గనుల తవ్వకం, తమ స్వార్థం కోసం, విలాసాల కోసం చెట్లను నరికి వేయడం వలన అడవులు కుదించుకుపోతున్నాయి. జీవవైవిధ్యం దెబ్బ తిని జంతు జాతుల మనుగడ కష్టం అవుతోంది. కొన్ని జీవజాతుల సంఖ్య చాలా తగ్గిపోయి తీవ్ర ముప్పు వాటిల్లి భవిష్యత్‌లో అవి కనుమరుగయ్యే స్థితికి చేరుకున్నాయి. చాలా జంతు జాతులు రెడ్ లిస్ట్‌లో చేరాయి. ఇలా అడవులు కుదించుకుపోవడం వలన భూతాపం విపరీతంగా పెరిగిపోయి భవిష్యత్‌లో ఈ భూమి మీద మానవ మనుగడ కూడా కష్టం అవుతుంది. ఇలాంటి అనర్థాలు జరగక ముందే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతుగా కనీసం ఒక్కొక్కరు వంద మొక్కలైనా నాటాలి. అడవుల విస్తీర్ణం పెంచడానికి ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. జీవవైవిధ్యాన్ని పెంచి వనరుల మధ్య సమతౌల్యాన్ని కాపాడాలి. ప్రకృతికి, మనిషికి మధ్య స్నేహ భావం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- సురేష్,
ఖానాపురం, కర్నూల్.

వ్యవస్థల వైఫల్యం!

రాష్ట్రంలో యువతలో రోజు రోజుకు హింసా ప్రవృత్తి పెరిగిపోవడం ప్రతి ఒక్కరినీ ఆందోళనకు గురిచేస్తున్నది. సమస్య మూలాల్లోకి వెళితే చట్టాలు, పోలీసు వ్యవస్థ తమను ఏమీ చేయలేవన్న ధీమా పెరిగిపోయింది. ఆపైన రాజకీయ అండదండలతో మరింత బరితెగిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా హత్యలు, అత్యాచారాలు, ఇంకా అనేక చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారికి శిక్షలు పడిన దాఖలాలు లేవు. పాలకులు చట్టసభల్లో ఊకదంపుడు, బడాయి కబుర్లు చెప్పడం, అందుకు విరుద్ధంగా పోలీసు వ్యవస్థను దుర్వినియోగ పరిచి కేసులను నీరుగార్చే ప్రక్రియ యథేచ్ఛగా కొనసాగుతున్నది. విధి నిర్వహణలో భాగంగా హంతకులను పట్టుకోవడానికి వచ్చిన కేంద్ర సి.బి.ఐ. అధికారుల మీదే ఎదురు కేసులు పెట్టిస్తున్నారంటే రాజకీయ అధికార దుర్వినియోగం ఏ స్థితికి వెళ్లిందో ప్రతి ఒక్కరికి అర్థం అవుతున్నది. గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరుకోవడం ఎందుకు? ప్రజాక్షేత్రంలో పాలకులే ముద్దాయిలు!

జి.రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

సెటైర్

మిర్రర్ ఇమేజ్

వావ్! ఈ డ్రస్‌లో మీరు సూపర్. అదిరిపోతున్నారు సార్...

ఆ విషయం నాకు తెలుస్తుందిలే సెక్రటరీ. నీవు మరీ అంతగా ఇదైపోనక్కర్లా...డ్రస్సింగ్ టేబుల్ దగ్గరున్న నిలువుటద్దంలో చూసుకుంటున్నాగా... డ్రస్ లోపల నా ఛాతీ యాభై ఆరు ఇంచ్‌లు పెరుగుతుందా...లేదా...అది తేల్చుకోవాలి.


ఎందుకు పెరగదు సార్. మీరిప్పుడు విశ్వగురూ... విశ్వనేత... జగ్గజ్జేతగా అగ్రరాజ్యం అమెరికా వెళ్ళబోతున్నారు. యోగా డే నాడు ఆ దేశం నుండే ప్రపంచానికి పాఠాలు చెప్పబోతున్నారు సార్!

విసిత్రం ఏంటంటే సెక్రటరీ... ఒకనాడు నేను గుజరాత్ నేతగా ఉన్నప్పుడు వీసా ఇవ్వడానికే నిరాకరించిన అమెరికా, మరిప్పుడు రెడ్ కార్పెట్ పరిచి గ్రాండ్ వెల్‌కమ్ చెప్పడం చూస్తుంటే... ఛాతీ నిజంగానే ఉప్పొంగుతుందయ్యా! అక్కడ మనం ఇమానం దిగిన దగ్గర నుండీ... ఏదీ, తిరుగు ప్రయాణం అయ్యేంత వరకు అన్నీ రాచమర్యాదలే అనుకో.

రాచమర్యాదలు అని చిన్నగా అంటారేంటి సార్. రాజభోగం. కాకపోతే మీడియా పత్రికల వాళ్ళకే కన్ను కుడుతున్నది. ఏదిబడితే అది రాస్తున్నారు సార్.

ఏమని? ఓసారి చదువు...

ప్రస్తుతం అమెరికాలో 50 లక్షల మంది భారతీయులు ఉన్నారని, వారిలో చాలామంది అక్కడ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ...వారి ఓటు బ్యాంకును ప్రభావితం చేస్తున్నారని, గనుకనే గత ఎన్నికల్లో భారత సంతతికి చెందిన కమలా హ్యారిస్ ఉపాధ్యక్ష పదవికి ఎన్నికయ్యారని రాశారు. గత ఎన్నికల్లో 74 శాతం మంది ఇండియన్ అమెరికన్లు ఇప్పటి అధ్యక్షుడు జోబైడెన్ గెలుపునకు ఆ విధంగా మద్దతు ఇచ్చారని పేర్కొంటూనే... ఈసారి ఎన్నికల్లో అభ్యర్థిత్వం కోసం నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి వంటి వారు పోటీ పడుతున్నారని తెలిపారు. తత్ కారణంగానే తమరికి ఘనమైన ఆతిథ్యం ఇవ్వడం ద్వారా అమెరికన్ డెమోక్రాట్లు భారత్‌కు మరింత సన్నిహితం అన్న సంకేతాలు పంపడానికే ఇంత హడావుడి చేస్తున్నారని విమర్శిస్తున్నారు.



ఇందులో విమర్శేముంది సెక్రటరీ? అదంతా నిజమేగా...

నిజమా..? ఇందులో మీ గొప్ప ఏమీ లేదనీ, ఇదంతా అమెరికా వారి స్వప్రయోజనం కోసమే వారు చేస్తున్నారని ఇన్‌డైరెక్టుగా రాశారు సార్. ఒక విధంగా మిమ్మల్ని వాడుకుంటున్నారు సార్...

ఆ...రాసేవాడు రాసుకోనీ, వాగేవాడు వాగుకోనీ... ఎవరేమనుకుంటే మనకెందుగ్గానీ, మనకు దక్కాల్సిన మర్యాదలు, భోగభాగ్యాలు మనకు దక్కుతున్నాయిగా ...అయినా నీవంతగా మరీ ఇదైపోనక్కర్లా సెక్రటరీ. గతంలో 2014లో దేశాధినేతగా అమెరికా వెళ్ళానా...అప్పుడు న్యూయార్క్ లోని మాడిన్ స్క్వేర్‌లో ఇరవై వేలమంది మన భారతీయులు జమయ్యారు. తెలుసా. మరల 2019లో అదేంటీ హౌడీ ...డీ ప్రోగ్రామ్‌కి ఏభై వేల మంది జమయ్యారు. ఈసారి టైమ్ స్క్వేర్ నుండి నయాగరా జలపాతం వరకు కనీసం లక్ష మంది జమవుతారు కచ్చితంగా... మరి నా ఛాతీ పెరగకుండా ఎలా ఉంటుంది?

అందుకే ఇంట్లో ఈగల మోత - బయట పల్లకీ మోత అని మన మీడియా ఘోషిస్తున్నది.

అబ్బా సెక్రటరీ...శుభం పలకరా అంటే పెళ్ళికూతురు ముండ ఎక్కడుందీ అన్నట్టు ఆ అపశకునపు మాటలేమిటి?

మణిపూర్‌లో మారణహోమం చెలరేగి వంద మందికి పైగా ప్రాణాలు పోయాయి. నెల రోజులైనా మంటలు ఆరడం లేదు. పచ్చటి అడవులు నెత్తురోడుతున్నాయి. ప్రజల హాహాకారాలు మిన్నంటుతున్నాయి. అయినా దేశాధినేత కానరావడం లేదు. పెదవి విప్పడం లేదు? ఏమయ్యాడు? అంటూ పోస్టర్లు వేసి గగ్గోలు పెడుతున్నారు సార్...

ఏనుగు దారెంట పోతుంటే ఎన్నో కుక్కలు మొరుగుతాయి. వాటిని లెక్కచేస్తామా ఏమిటి? తాపీగా ఈ చెవితో విని ఈ చెవితో వదిలెయ్యాలి. ఈ రాజకీయ రహస్యం తెలియకపోతే ఎలా సెక్రటరీ...

రహస్యం కాదు సార్. అంతా బహిరంగమే. ఈ పత్రిక చూడండి... ఏమని రాసిందో. 22వ తేదీన తమరు అమెరికా పర్యటనలో ఉన్నప్పుడే, మీ రాకకు నిరసన తెలియజేస్తూ అమెరికా అధ్యక్ష భవనం సమీపంలోనే హక్కుల సంఘాలవాళ్ళు పెద్దఎత్తున ప్రదర్శన చేస్తారట. అంతే కాదు సారూ...వాషింగ్టన్‌లో, గుజరాత్ నరమేధం-2002పై ప్రత్యేకంగా రూపొందించిన బి.బి.సి. డాక్యుమెంటరీ చిత్రాలను ప్రదర్శిస్తాయట. ఆ ప్రదర్శనలను తిలకించేందుకు అక్కడి ప్రజా ప్రతినిధులను, మేధావులను, పాత్రికేయులను ఆహ్వానిస్తాయట.

ఊ... సెక్రటరీ... దీని తస్సాదియ్యా! ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని వేరే చెప్పాలా... ఈ కుట్రలో స్వదేశీయులేగాక విదేశీయులు కూడా ఉంటారు. నీవంతగా ఆశ్చర్యపడక్కర్లేదు. మీడియావాళ్ళే ఆ కుట్రదారుల్ని ఉద్యమకారులు, ఆందోళనకారులు, హక్కుల కార్యకర్తలు అని నానా పేర్లు పెడతారు (అద్దంలో చూసుకుంటూ). ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే...ఇప్పుడేసుకున్న డ్రస్ కన్నా గొప్ప డ్రస్‌లు మరో డజను సెలక్ట్ చేసిపెట్టు. అమెరికాలో వేసుకోవాలి. ఛాతీ కూడా పెరుగుద్దీ, గుర్తుంచుకో. వస్తా.

చిత్తం సార్ (బుర్ర గోక్కుంటూ పత్రికలో వ్యాఖ్యను చదువుకున్నాడు).

'అద్దంలో కనపడే ప్రతిబింబాన్ని చూసి కుక్క...తనే అనుకుంటుందా లేక వేరే కుక్క అని మొరుగుతూ భ్రాంతి పడుతుందా...?!'

- కె. శాంతారావు,
సెల్: 9959745723

లింగమనేని ఇంటి జప్తు కేసు విచారణ వాయిదా

● మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరణ

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నివాసం ఉండే లింగమనేని రమేష్ ఇంటిని జప్తునకు విజయవాడ కోర్టులో సిఐడి దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి చర్యలను నిలుపుదలకు హైకోర్టు నిరాకరించింది. సిఐడి పిటిషన్‌లో తన వాదనలు వినాలంటూ లింగమనేని దాఖలు చేసిన పిటిషన్‌కు విరుద్ధంగా న్యాయవాది అఫిడవిట్ దాఖలు చేయడాన్ని అభ్యంతరం చెప్పింది. మూడో వ్యక్తి అఫిడవిట్ ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించింది. ఈ మేరకు సిఐడి చేసిన వాదనల తర్వాత హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సిఐడిని ఇదేశించింది. విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తూ జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

లింగమనేని రమేష్ తరపున న్యాయవాది కోటేశ్వరరావు ఎసిబి కోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. లింగమనేని వాదన వినేందుకు ఆ కోర్టు నిరాకరించింది. దీనిని సవాల్ చేస్తూ లింగమనేని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయవాది ఎన్ అశ్వనీ కుమార్ వాదిస్తూ.. సిఐడి అభ్యంతరాలపై లింగమనేని వాదనలు చెప్పుకునే అవకాశం కల్పించాలని కోరారు. జప్తు చేస్తే తీవ్రంగా నష్టపోతామన్నారు. ఈ మేరకు వేసిన పిటిషన్‌ను ఎసిబి కోర్టు తిరస్కరించిందని చెప్పారు. దీనిపై సిఐడి తరపున న్యాయవాది వైఎన్ వివేకానంద స్పందిస్తూ.. ఎసిబి కోర్టులో లింగమనేని పిటిషన్ వేయలేదని, ఆ వ్యవహారంతో సంబంధం లేని న్యాయవాది వేశారని చెప్పారు. ఆ పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు.

హైకోర్టుకు వెళ్లే రహదారుల్లో లైట్లు

ప్రజాశక్తి-అమరావతి

విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి హైకోర్టు రహదారులకు ఇరువైపులా వీధి దీపాల ఏర్పాటు చర్యలు 85 శాతం అయ్యాయని హైకోర్టుకు సిఆర్‌డిఎ తెలిపింది. ఈ నెలాఖరులోగా మిగిలిన పనులు పూర్తవుతాయని చెప్పింది. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, వ్యక్తిగత హాజరు నుంచి సిఆర్‌డిఎ కమిషనరు వివేక్ యాదవ్‌కు హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు జస్టిస్ దొనడి రమేష్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టుకు వెళ్లే రోడ్డు నిర్మాణం, వీధి దీపాల ఏర్పాట్లు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అక్కెన వేణుగోపాలరావు దాఖలు చేసిన రిట్‌పై విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

మత్స్యకారులకు చంద్రబాబు ఏం చేశారు?

● పవన్‌కల్యాణ్‌కు మంత్రి సీదిరి ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మత్స్యకారులకు చంద్రబాబు 14 ఏళ్లకాలంలో ఏం చేశారో పవన్‌కల్యాణ్ చెప్పాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ బోటు ఎక్కితే మత్స్యకారుల సమస్యలు తెలియవని విమర్శించారు. చంద్రబాబు సిఎంగా ఎన్ని పోర్టులు, హార్బర్ల కట్టారో తెలుసా? అని ప్రశ్నించారు. ఆయన హయాంలో ఎక్కడా ఒక చిన్న ఇటుక ముక్క కూడా వేయలేదని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజనరీ సిఎం కాబట్టే మత్స్యకారులకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. హార్బర్లు లేవనే వలసలు వెళ్తున్నారని గుర్తించి నాలుగు హార్బర్ల నిర్మాణానికి సిఎం జగన్ శ్రీకారం చుట్టారని అన్నారు. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ డిఇఒ

● కొత్తగా 21 పోస్టులు మంజూరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక డిప్యూటీ డిఇఒ పోస్టును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు జిఒ 56ను పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మంగళవారం విడుదల చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 53 మంజూరు పోస్టులు ఉన్నాయి. కొత్తగా 21 పోస్టులను ప్రభుత్వం పెంచింది. ప్రతి రెవెన్యూ డివిజన్‌లో డిప్యూటీ డిఇఒ ఉండాలని పేర్కొంది.

పోలీసుల వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మహానంది (నంద్యాల)

పోలీసుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహానంది మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. మంగళవారం గోపవరం గ్రామ సమీపంలో నంద్యాల తోట లైనుకు చెందిన చిన్న బాబు (22) అనే యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. బైకు చోరీ కేసు విషయంలో చిన్న బాబు అనే యువకుడిని సోమవారం రాత్రి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్లిన పోలీసులు విచారించారు. చేయని నేరానికి అవమానాన్ని భరించలేక బాధితుడు చిన్న బాబు సెల్ఫీ వీడియో తీసుకొని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సెల్ఫీ వీడియోలో బాధితుడు చిన్న బాబు తనపై లేని కేసును వన్ టౌన్ పోలీసులు పెట్టారని, కేసును ఒప్పుకోమని వన్ టౌన్ ఎస్ఐ సుబ్బరామిరెడ్డి, కానిస్టేబుల్స్ నాగ న్న, ఏసుదాసు బెదిరిస్తున్నారని ఈ అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్టు సెల్ఫీ వీడియోలో తెలిపారు.తక్షణమే మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

ఈతకెళ్లి బాలుడు మృతి

కళ్యాణదుర్గం : పట్టణ సమీపంలో ఉన్న ప్రయివేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌లో ఈతకెళ్లి చరణ్ (12) మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మధ్యాహ్నం నుంచి పాఠశాలలకు సెలవు కావడంతో తల్లి, అక్కతో కలిసి చరణ్ ఈతకు వెళ్లాడు. ఇందులో భాగంగా పూల్‌లో ఈత కొడుతూ నీటిలో మునిగాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో తల్లి, అక్క కేకలు వేశారు. అక్కడున్న వారు వెంటనే చరణ్‌ను బయటకు తీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చరణ్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టైటానిక్ శిథిలాల వద్దకు వెళుతున్న మినీ జలాంతర్గామి మిస్సింగ్ !

బోస్టన్ : అట్లాంటిక్ మహా సముద్రంలో మునిగిపోయిన టైటానిక్ ఓడ శిథిలాలను వీక్షించేందుకు వెళుతున్న మినీ జలాంతర్గామి అకస్మాత్తుగా గల్లంతు కావడంతో దాని కోసం లోతైన సముద్ర జలాల్లో సోమవారం గాలింపు చర్యలు చేపట్టారు. మినీ జలాంతర్గామికి మద్దతుగా వచ్చే కెనడా రీసెర్చ్ ఐస్‌బ్రేకర్ పోలార్ ప్రిన్స్‌తో సంబంధాలు తెగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని సంబంధిత అధికారులు తెలిపారు. గాలింపు చర్యలకు కెనడా కోస్ట్ గార్డ్ నౌక, సైనిక విమానం సహాయమందిస్తున్నాయి. బోస్టన్‌లోని అమెరికా కోస్ట్ గార్డ్ దళాల నేతృత్వంలో ఈ గాలింపు చర్యలు సాగుతున్నాయి. మినీ జలాంతర్గామి గల్లంతైన ప్రదేశం సముద్రంలో చాలా లోతైన ప్రదేశం కావడంతో గాలింపు జరపడం అత్యంత సవాళ్లతో కూడినదని అమెరికా కోస్ట్ గార్డ్ కమాండర్ రియర్ అడ్మిరల్ జాన్ మాగ్వెర్ తెలిపారు. ఈ జలాంతర్గామిలో శత కోటీశ్వరులు, వ్యాపారవేత్తలు, కార్పొరేట్‌రంగ ప్రముఖులు వున్నట్లు తెలుస్తోంది. ఈ మినీ జలాంతర్గామిని నిర్వహించే ఓషన్‌గేట్ వ్యవస్థాపకుడు స్టాక్టన్ రష్ కూడా ఇందులో వున్నట్లు తెలుస్తోంది. ఓషన్‌గేట్ చేపట్టిన సాహస యాత్రలో టైటానిక్ ఓడ శిథిలాల సందర్శన ఒక భాగంగా వుంది. న్యూ ఫౌండ్‌లాండ్ నుంచి ఈ యాత్ర బయలుదేరింది. 400 నాటికల్ మైళ్ల దూరంలో టైటానిక్ శిథిలాలు వున్నాయి. మొదటి గంటా 45నిముషాలు ప్రయాణం సాఫీగా సాగింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref: B1/314/2022 ఫారం నెం.VII ది.17-06-2023

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్(1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్ధిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణం **య. 105.03** సెంట్లును ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు నిమిత్తం, అల్లూరి సీతారామరాజు జిల్లా, **దేవీపట్నం మండలం, తొయ్యేరు గ్రామం** నకు సంబంధించిన భూములు అవసరమైనవని ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ అవసరమగు నిధులను సమకూర్చినందున, ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య. 105.03 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు నిమిత్తం అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: అల్లూరి సీతారామరాజు మండలం: దేవీపట్నం గ్రామం: తొయ్యేరు

క్రమ సంఖ్య	సర్వే నెం. స.డి.నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య.సెంట్లు	భూ సేకరణ క్రింద విస్తీర్ణం య.సెంట్లు	వెబ్ ల్యాండ్ ప్రకారం సంబంధిత ఆసామి పేరు	సంబంధిత ఆశక్తి గల ఆసామి పేరు	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)
1	1/1	అ.పుంజ	1.31	1.31	మడకం బాపన్న దొర	--	లంక	1/2.	1/1B	నది	-లేవు-
2		అ.పుంజ	1.38	1.38	మడకం వెంకన్న దొర	--	లంక	1/2	2	1/2	-లేవు-
3	1/2	అ.పుంజ	1.76	1.76	కొవ్వాసి మల్లు దొర	--	1/1	2	2/2B	1/2	-లేవు-
4		అ.పుంజ	1.62	1.62	కొవ్వాసి చెల్లన్న దొర	--	కొండ	2	కొండ	1/2	-లేవు-
5		అ.పుంజ	0.45	0.45	కొవ్వాసి బొజ్జి దొర	--	1/1	2	1/3	నది	-లేవు-
6	2/3	అ.పుంజ	1.58	1.58	చారపు పాపరావు	--	1	2/2	2/3	నది	-లేవు-
7	2/2	అ.పుంజ	1.19	1.19	చారపు సుబ్బారావు	--	1	2/4	2/3	2/1	-లేవు-
8	3/1	అ.పుంజ	4.01	4.01	చారపు బాలరాజు	--	2	4	కొండ	నది	-లేవు-
9	3/6	అ.పుంజ	0.30	0.30	తురస రాంబాబు దొర	తురస సుబ్బారావు (తండ్రి) కొమ్మన్న దొర	3/3	3/4	3/3	3/1	-లేవు-
10		అ.పుంజ	0.39	0.39	తురస రామయ్యమ్మ	తురస చిన్నపుదొర	కొండ	3/3	11	3/1	-లేవు-
11		అ.పుంజ	0.96	0.96	తురస రామయ్యమ్మ	తురస చిన్నపు దొర	కొండ	3/3	11	3/1	-లేవు-
12	3/3	అ.పుంజ	0.82	0.82	తురస చెంచన్న దొర	తురస వెంకన్న దొర (తండ్రి) తమ్మన్న దొర	3/2	3/4	11	3/1	-లేవు-
13	3/4	అ.పుంజ	0.64	0.64	తురస రామయ్యమ్మ	తురస చిన్నపు దొర	3/3	3/5	5	3/1	-లేవు-
14	3/5	అ.పుంజ	0.64	0.64	తురస రాంబాబు	తురస బాబూరావు (తండ్రి) కొమ్మన్న దొర	3/4	4, 5	5	3/1	-లేవు-
15	4/1A	రైతు పుంజ	0.86	0.86	చారపు వేంకటేశ్వర రావు దొర	కారం రమణ (భర్త) (లేటు) రాంబాబు మిర్తి రెడ్డి రామక్రిష్ణ రెడ్డి	5	4/1B	5	3	-లేవు-
16	4/2A	రైతు పుంజ	0.02	0.02	చారపు సుబ్బారావు	--	4/1A	4/2B	4/3	4/1A	-లేవు-
17	4/3	రైతు పుంజ	0.71	0.71	తురస చెంచన్న దొర	D. అచ్చన్న	5	నది	4/4	4/2A, 2B	-లేవు-
18	4/4	అ.పుంజ	0.72	0.72	కొవ్వాసి పోతురాజు	రామరాజు	5	నది	5	4/3	-లేవు-
19	6/1	అ.పుంజ	1.31	1.31	చారపు వేంకటేశ్వర రావు దొర	కారం రమణ (భర్త) (లేటు) రాంబాబు	10	నది	6/2	5	-లేవు-
20	6/2	అ.పుంజ	1.33	1.33	చారపు సుబ్బారావు	--	10	నది	3	6/1	-లేవు-
21	6/3	అ.పుంజ	0.89	0.89	మడి పోసయ్య దొర	--	10	నది, 7	7	6/2	-లేవు-
22	7/2	అ.పుంజ	3.66	3.66	చారపు బాలరాజు	--	9	నది	8	6	-లేవు-
23	8/4	రైతు పుంజ	3.41	3.41	చారపు లచ్చన్న దొర	--	9	8/3	8/2	7	-లేవు-
24	9/5	అ.పుంజ	1.83	1.83	తురస గంగా భవానీ	తురస వెంకన్న దొర (తండ్రి) తమ్మన్న దొర	15, 16	7, 8	9/4	9/2	-లేవు-
25	9/4	రైతు పుంజ	2.25	2.25	మడి పోసయ్య దొర	మడి చిన్నపు దొర (తండ్రి) సోమన్న దొర	16, 18	8	18	9/3	-లేవు-
26	10/2	రైతు పుంజ	0.35	0.35	మడి పోసయ్య దొర	--	13	10/5	10/3	11	-లేవు-
27	10/3	రైతు పుంజ	0.22	0.22	మడి అబ్బాయి దొర	--	13	10/5	10/4	10/2	-లేవు-
28	10/4	రైతు పుంజ	0.07	0.07	మడకం రామయ్యమ్మ	--	13	10/5	10/5	10/3	-లేవు-
29	10/7	రైతు పుంజ	2.17	2.17	కొవ్వాసి మల్లు దొర	--	10/6	10/9	10/8	10/1	-లేవు-
30	10/8	రైతు పుంజ	1.43	1.43	కొవ్వాసి చెల్లన్న దొర	--	10/7	10/9, 10	15	10/7	-లేవు-
31	11/3	అ.పుంజ	0.44	0.44	మడి అబ్బాయి దొర	--	11/2	5	18	5	-లేవు-
32	11/4	అ.పుంజ	0.47	0.47	మడి పోసయ్య దొర	మడి చిన్నప్ప దొర (తండ్రి) సోమన్న దొర	12	11/5	11/6	11/2	-లేవు-
33	11/5	అ.పుంజ	0.44	0.44	కొమరం సుబ్బారావు	--	11/4	18	11/7	11/2,3	-లేవు-
34			0.59	0.59	తుర్రం చెల్లన్న దొర	--	11/4	18	11/7	11/4	-లేవు-
35	11/6	అ.పుంజ	0.81	0.81	కొమరం లచ్చన్న దొర	కొమరం జగ్గారావు (తండ్రి) గంగన్న దొర కొమరం చిన్నాలమ్మి (భర్త) (లేటు) లచ్చన్న దొర తెల్లం లీలావతి (భర్త) వీరాస్వామి దొర మూలెం కృష్ణకుమారి (భర్త) రాంబాబు తుర్రం గంగామణి (భర్త) సత్యనారాయణ శిరసం విజయ లక్ష్మి (భర్త) బొజ్జి దొర కొమరం సుబ్బారావు (తండ్రి) లేటు లచ్చన్న దొర.	13	11/7	13	11/4	-లేవు-
36			0.30	0.30	కొమరం సుబ్బారావు		13	11/7	13	11/4	-లేవు-
37	11/7	అ.పుంజ	0.79	0.79	మడకం లచ్చన్న దొర	--	11/6	18	13	11/5	-లేవు-
38	12/1	అ.పుంజ	2.57	2.57	మడకం బాపన్న దొర	మడకం భవానీ (భర్త) (లేటు) వెంకన్న దొర	కొండ	3	12/2	కొండ	-లేవు-
39	12/3	అ.పుంజ	1.28	1.28	మాడకం లచ్చన్న దొర	మడి బుచ్చన్న దొర (తండ్రి) చిన్నపు దొర	కొండ	11	13	12/2	-లేవు-
40		అ.పుంజ	0.20	0.20	మడి అబ్బాయి దొర	--	కొండ	11	13	12/2	-లేవు-
41		అ.పుంజ	1.11	1.11	మాడకం లచ్చన్న దొర	--	కొండ	11	13	12/2	-లేవు-
42	13/2	రైతు పుంజ	0.28	0.28	తురస లచ్చన్న దొర	--	కొండ	13/3	13/15	13/1	-లేవు-
43	13/3B	రైతు పుంజ	0.12	0.12	తురస బాబూరావు దొర		13/2	13/4	13/15	13/1,5	-లేవు-
44	13/4	రైతు పుంజ	0.25	0.25	తురస రామయ్యమ్మ	తురస వెంకన్న దొర (తండ్రి) తమ్మన దొర	13/3	13/6	13/14,15	13/5	-లేవు-
45	13/5	రైతు పుంజ	0.89	0.89	కొవ్వాసి అక్కమ్మ	--	13/1	11,13	13/3,4	12	-లేవు-
46	13/6	రైతు పుంజ	0.35	0.35	మడకం బాపన్న దొర	--	13/4,5	13/7	13/14	11	-లేవు-
47	13/7	రైతు పుంజ	0.33	0.33	మడకం వెంకన్న దొర	--	13/6	13/8,9	13/14	11	-లేవు-
48	13/8	రైతు పుంజ	0.15	0.15	మడి పోశయ్య దొర	--	13/7	13/13	13/14	13/9	-లేవు-
49	13/9	రైతు పుంజ	0.15	0.15	మడి అబ్బాయి దొర	--	13/7	13/12	13/8	13/10	-లేవు-
50	13/10	రైతు పుంజ	0.27	0.27	మడకం లచ్చన్న దొర	--	13/7	13/11	13/9	11	-లేవు-
51	13/11	రైతు పుంజ	0.70	0.70	మడకం ఇరమన్న దొర	--	13/10	10	13/12	11	-లేవు-
52	13/12	రైతు పుంజ	0.16	0.16	మడి బుచ్చన్న దొర	--	13/9	10	13/13	13/11	-లేవు-
53	13/13	రైతు పుంజ	0.12	0.12	మడి అబ్బాయి దొర	--	13/8	10	13/14	13/ 12	-లేవు-
54	13/14	రైతు పుంజ	0.99	0.99	మూలం గాలెమ్మ	--	13/15,16	10	13/22,23	13/6,7,8	-లేవు-
55	13/15	రైతు పుంజ	0.52	0.52	చారపు వేంకటేశ్వర రావు దొర	--	కొండ	13/14	13/16	13/2,3,4	-లేవు-
56	13/16	రైతు పుంజ	0.73	0.73	చారపు సుబ్బారావు దొర	--	కొండ	13/14	13/17,21	13/15	-లేవు-
57	13/17	రైతు పుంజ	0.67	0.67	కొవ్వాసి మల్లు దొర	--	కొండ, 13/15	13/20, 21,	13/19	13/16	-లేవు-
58	13/18	రైతు పుంజ	0.32	0.32	చారపు వెంకటేశ్వరులు దొర	--	కొండ	13/17, 19	కొండ	కొండ	-లేవు-
59	13/19	రైతు పుంజ	0.44	0.44	కొవ్వాసి చెల్లన్న దొర	--	13/18	13/20	కొండ	13/17	-లేవు-
60	13/21	రైతు పుంజ	0.39	0.39	కొవ్వాసి పోతురాజు	కొవ్వాసి అమ్ములు (భర్త) (లేటు) పోతురాజు	13/17	13/22	13/20	13/16	-లేవు-
61	13/22	రైతు పుంజ	0.63	0.63	చారపు బాలరాజు	--	13/21	13/23	1	13/14	-లేవు-
62	13/23	రైతు పుంజ	0.63	0.63	కొమరం లచ్చన్న దొర	కొమరం చిన్నాలమ్మి (భర్త) (లేటు) లచ్చన్న దొర తెల్లం లీలావతి (భర్త) వీరాస్వామి దొర మూలెం కృష్ణకుమారి (భర్త) రాంబాబు తుర్రం గంగామణి (భర్త) సత్యనారాయణ శిరసం విజయ లక్ష్మి (భర్త) బొజ్జి దొర కొమరం సుబ్బారావు (తండ్రి) లేటు లచ్చన్న దొర.	13/22	10	1	13/14	-లేవు-
63	14/1A	రైతు పుంజ	0.27	0.27	చారపు గంగన్న దొర	--	కొండ	14/2A	14/1B	13	-లేవు-
64	14/1B	రైతు పుంజ	0.20	0.20	చారపు పాపారావు	--	కొండ	14/2B, 2C	14/3,4	14/1A	-లేవు-
65	14/2A	రైతు పుంజ	0.20	0.20	కొమరం లచ్చన్న దొర	--	14/1A	10	14/2B	13	-లేవు-
66	14/2B	రైతు పుంజ	0.19	0.19	కొమరం జగ్గన్న దొర	--	14/1A, 1B	10	14/2C	14/2A	-లేవు-
67	14/2C	రైతు పుంజ	0.35	0.35	కొమరం బుచ్చన్న దొర	--	14/1B,3	14/7A	14/3	14/2B	-లేవు-
68	14/3	రైతు పుంజ	1.09	1.09	చారపు సుబ్బారావు	--	14/4	14/7B	14/6	14/2C	-లేవు-
69	14/4	రైతు పుంజ	0.28	0.28	చారపు వేంకటేశు దొర	కారం రమణ (భర్త)(లేటు) రాంబాబు	కొండ	14/3	14/5A	14/1B	-లేవు-
70	14/5A	రైతు పుంజ	0.22	0.22	చారపు గంగన్న దొర	--	కొండ	14/6	14/5B	14/3,4	-లేవు-
71	14/5B	రైతు పుంజ	0.32	0.32	చారపు పాపరావు	--	కొండ	14/6	14/5C	14/5A	-లేవు-
72	14/5C2	రైతు పుంజ	0.36	0.36	చారపు గంగన్న దొర	--	కొండ	14/7B	14/5D, 5E	14/5D,6	-లేవు-
73	14/5D	రైతు పుంజ	0.80	0.80	చారపు పాపరావు	--	కొండ	14/5c	17	14/5c	-లేవు-
74	14/5E	రైతు పుంజ	0.80	0.80	చారపు పాపరావు	--	17	14/7B	16, 17	14/5C	-లేవు-
75	14/6	రైతు పుంజ	0.84	0.84	చారపు వేంకటేశు దొర	కారం రమణ (భర్త)(లేటు) రాంబాబు	14/5A	14/7C	14/5C	14/3	-లేవు-
76	14/7A	రైతు పుంజ	0.05	0.05	కొమరం జగ్గన్న దొర	--	14/2C	14/7B	14/3	10	-లేవు-
77	14/7B	అ.పుంజ	0.37	0.37	కొమరం జగ్గన్న దొర	--	14/7A,3	14/7C	14/6	10	-లేవు-
78	14/7D	రైతు పుంజ	1.11	1.11	మడకం రామయ్యమ్మ	--	14/7B	15	15	10	-లేవు-
79	15/1	రైతు పుంజ	1.01	1.01	కొవ్వాసి పోతురాజు	కొవ్వాసి అమ్ములు (భర్త) (లేటు) పోతురాజు	14	10, 15/3	15/2C	10	-లేవు-
80	15/2B	రైతు పుంజ	1.01	1.01	కొమరం జగ్గన్న దొర	కొమరం చిన్నాలమ్మి (భర్త) (లేటు) లచ్చన్న దొర తెల్లం లీలావతి (భర్త) వీరాస్వామి దొర మూలెం కృష్ణకుమారి (భర్త) రాంబాబు తుర్రం గంగామణి (భర్త) సత్యనారాయణ శిరసం విజయ లక్ష్మి (భర్త) బొజ్జి దొర కొమరం సుబ్బారావు (తండ్రి) లేటు లచ్చన్న దొర.	14	15/2C	16	14	-లేవు-
81	15/2C	రైతు పుంజ	0.74	0.74	కొమరం లచ్చన్న దొర	--	15/2B	15/3	16	15/1,14	-లేవు-
82			0.74	0.74	కొమరం సుబ్బారావు	కొమరం లచ్చన్న దొర	15/2B	15/3	16	15/1,14	-లేవు-
83	15/3A	రైతు పుంజ	1.51	1.51	చారపు సుబ్బారావు	--	15/1, 2C,16	9 10	16	9 10	-లేవు-
84	16/2B	రైతు పుంజ	0.83	0.83	మడకం రామయ్యమ్మ	--	16/2A	16/6	16/3B	15	-లేవు-
85	16/3B	రైతు పుంజ	0.75	0.75	కొవ్వాసి పోతురాజు	కొవ్వాసి అమ్ములు (భర్త) (లేటు) పోతురాజు	16/3A	16/6	16/5A	16/ 2C	-లేవు-
86	16/4B	రైతు పుంజ	0.75	0.75	చారపు బాలరాజు	--	16/4A	16/5A, 5B	18	16/4A	-లేవు-
87	16/5A	రైతు పుంజ	0.42	0.42	కొమరం బుచ్చన్న దొర	--	16/4B	16/6,7	16/5B	16/3	-లేవు-
88	16/5B1	రైతు పుంజ	0.135	0.135	కొమరం లచ్చన్న దొర	కొమరం చిన్నాలమ్మి (భర్త) (లేటు) లచ్చన్న దొర తెల్లం లీలావతి (భర్త) వీరాస్వామి దొర మూలెం కృష్ణకుమారి (భర్త) రాంబాబు తుర్రం గంగామణి (భర్త) సత్యనారాయణ శిరసం విజయ లక్ష్మి (భర్త) బొజ్జి దొర కొమరం సుబ్బారావు (తండ్రి) లేటు లచ్చన్న దొర.	16/4B	16/7	18	16/5A	-లేవు-
89			0.135	0.135	కొమరం సుబ్బారావు		16/4B	16/7	18	16/5A	-లేవు-
90	16/6	రైతు పుంజ	2.84	2.84	మడి పెంటయ్య దొర	కొమరం చిన్నాలమ్మి (భర్త) (లేటు) లచ్చన్న దొర తెల్లం లీలావతి (భర్త) వీరాస్వామి దొర మూలెం కృష్ణకుమారి (భర్త) రాంబాబు తుర్రం గంగామణి (భర్త) సత్యనారాయణ శిరసం విజయ లక్ష్మి (భర్త) బొజ్జి దొర కొమరం సుబ్బారావు (తండ్రి) లేటు లచ్చన్న దొర.	16/2B,3B ,5A	9,15	16/7	15	-లేవు-
91	18/1A	రైతు పుంజ	0.57	0.57	కొమరం వీరాయమ్మ	--	మంటూరు	18/1B	18/1D	17	-లేవు-
92	18/1B	రైతు పుంజ	0.52	0.52	కొమరం బుచ్చన్న దొర	--	18/1A	18/1C	18/1D	17	-లేవు-
93	18/1C	రైతు పుంజ	0.52	0.52	కొమరం జగ్గన్న దొర	--	18/1B	18/2	18/1D	16	-లేవు-
94	18/1D1	రైతు పుంజ	0.735	0.735	కొమరం లచ్చన్న దొర	కొమరం చిన్నాలమ్మి (భర్త) (లేటు) లచ్చన్న దొర తెల్లం లీలావతి (భర్త) వీరాస్వామి దొర మూలెం కృష్ణకుమారి (భర్త) రాంబాబు తుర్రం గంగామణి (భర్త) సత్యనారాయణ శిరసం విజయ లక్ష్మి (భర్త) బొజ్జి దొర కొమరం సుబ్బారావు (తండ్రి) లేటు లచ్చన్న దొర.	మంటూరు	18/2,3	18/1E	18/1A,1B, 1C	-లేవు-
95			0.735	0.735	కొమరం సుబ్బారావు		మంటూరు	18/2,3	18/1E	18/1A,1B, 1C	-లేవు-
96	18/2	రైతు పుంజ	0.52	0.52	చారపు వేంకటేశ్వర దొర	--	18/1c	18/4B	18/3	16	-లేవు-
97	18/3	రైతు పుంజ	0.49	0.49	చారపు సుబ్బారావు	--	18/1D	18/4B	18/4A	18/2	-లేవు-
98	18/4A2	రైతు పుంజ	0.49	0.49	మడకం లచ్చన్న దొర	--	19	18/4B	21	18/3	-లేవు-
99	18/4B	రైతు పుంజ	1.11	1.11	మడకం బాపన్న దొర	--	18/2,3,4 A	18/4C	21	16	-లేవు-
100	18/4C	రైతు పుంజ	0.99	0.99	మడకం వెంకన్న దొర	--	18/4B	18/4D	21	16	-లేవు-
101	18/4D	రైతు పుంజ	0.79	0.79	మడి అబ్బాయి దొర	--	18/4C	18/4E	`21	16	-లేవు-
102	18/4E	రైతు పుంజ	0.94	0.94	మడి బుచ్చన్న దొర	--	18/4D	18/4F	21	16	-లేవు-
103	18/4G	రైతు పుంజ	0.57	0.57	చారపు గంగన్న దొర	--	18/4F	18/4H	21	18/4I	-లేవు-
104	18/4H	రైతు పుంజ	0.49	0.49	మడకం లచ్చన్న దొర	--	18/4G	18/4J	21	18/4I	-లేవు-
105	18/4I	రైతు పుంజ	0.35	0.35	మడి బుచ్చన్న దొర	--	18/4G	18/4K	18/4G, 4H	9	-లేవు-
106	18/4J	రైతు పుంజ	0.89	0.89	మూలం గాలమ్మ	--	18/4H	18/4K	21	18/4I	-లేవు-
107	20/1	అ.పుంజ	1.98	1.98	సుంకర రాంబాబు	--	మంటూరు	21	20/2,6	19	-లేవు-
108	20/3	అ.పుంజ	0.44	0.44	సుంకర వెంకటాద్రి	--	మంటూరు	20/4	34	20/2	-లేవు-
109	20/4	అ.పుంజ	0.32	0.32	సుంకర సూర్యకాంతం	--	20/3	20/5	34	20/2	-లేవు-
110	20/5	అ.పుంజ	0.34	0.34	సుంకర అప్పారావు	--	20/4	20/6	34	20/2	-లేవు-
111	20/6	అ.పుంజ	2.12	2.12	సుంకర అప్పారావు	--	20/5	21,33	34	20/1,2	-లేవు-
112	21/2	రైతు పుంజ	1.14	1.14	తురస చెంచన్న దొర	--	21/1	21/6	21/3	18	-లేవు-
113	21/3	రైతు పుంజ	0.63	0.63	తురసం బాబూరావు దొర	--	21/1	21/6	21/4	21/2	-లేవు-
114		రైతు పుంజ	0.53	0.53	మడి పోసయ్య దొర	--	21/1	21/6	21/4	21/2	-లేవు-
115	21/4	రైతు పుంజ	1.11	1.11	చారపు వేంకటేశ్వర రావు దొర	--	21/1	21/6	21/5	21/3	-లేవు-
116	21/5	రైతు పుంజ	1.01	1.01	చారపు బాలరాజు	--	21/1	21/6	33	21/4	-లేవు-
117	21/6	రైతు పుంజ	0.94	0.94	కొవ్వాసి మల్లు దొర	--	21/2,3,4, 5	21/7	33	18	-లేవు-
118	38/4	అ.పుంజ	1.93	1.93	తిరుమలశెట్టి సీతారాములు	సిద్ధా నారాయణ స్వామి (తండ్రి) రామయ్య	38/2,3	38/1	47	38/1	-లేవు-
119	47/3	అ.పుంజ	1.11	1.11	సిద్ధా నారాయణ స్వామి	--	47/1	47/2	46	47/1	-లేవు-
120	48/4	అ.పుంజ	2.10	2.10	సుంకర రాంబాబు	--	49	47	51	41/3	-లేవు-
121	67/2	అ.పుంజ	1.24	1.24	పోసిన సూర్యకాంతం	--	65	66	67/3	65	-లేవు-
122	95/7	అ.పుంజ	2.10	2.10	కారం సూర్యారావు	--	97/3,5,6	95/8	గానుగుల గొంది	95/2	-లేవు-
123	96/2	అ.పుంజ	0.59	0.59	పంపన పెంటరావు	--	95	95/5	96/3	96/1	-లేవు-
		మొత్తం:		105.03							

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ, యూనిట్-1, రాజమహేంద్రవరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలో నైన తనిఖీ చేసుకోవచ్చు. చట్టములోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్టు ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్ట్ నిర్వాశిత కుటుంబములు ఎవ్వరు లేరు. బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.

సం/- **ఎస్.సరళ వందనం,** స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

డిసెట్‌లో 86.8% అర్హత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఇన్ డిప్లమో ప్రవేశ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (డిసెట్) ఫలితాలు విడుదలయ్యాయి. మొత్తం 86.8 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఫలితాలను పాఠశాల విద్యాశాఖ apdeecet.apcdss.in వెబ్‌సెట్‌లో పొందుపరిచింది. ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన పరీక్షకు మొత్తం 2,361 మంది హాజరయ్యారు. వీరిలో 2,051 మంది అర్హత సాధించగా, 310 మంది సాధించలేదు. మేథ్స్ సబ్జెక్టు తెలుగు మాధ్యమంలో బత్తు గుణశ్రీ 72 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. ఉర్దూ విభాగంలో ఎస్ ఆసియా 70 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. ఇంగ్లీష్ విభాగంలో కోట్ల హిమాశ్రీ 81 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. ఫిజికల్ సైన్స్ తెలుగు మీడియంలో అప్పికట్ల బిందు అనూష 68 మార్కులతో, ఉర్దూ మీడియంలో 50 మార్కులతో షేక్ ముక్తురున్నీషా, ఇంగ్లీష్ మీడియంలో 60 మార్కులతో అద్దంకి సాయిచందన మొదటి ర్యాంకు సాధించారు. బయోలజీ తెలుగు మీడియంలో 69 మార్కులతో గొల్ల చంద్రకళ, ఉర్దూలో 60 మార్కులతో ఉద్దల చరణి, తమిళ్‌లో 46 మార్కులతో ఎం గ్రేసి, ఇంగ్లీష్‌లో 86 మార్కులతో వనతారక స్వరూప మొదటి ర్యాంకు సాధించారు. సోషల్ స్టడీస్ తెలుగు మాధ్యమంలో 72 మార్కులతో నీరుగట్టి బాలప్రకాష్, ఉర్దూలో 60 మార్కులతో మొఘల్‌షీమా స్వలేహ, ఇంగ్లీష్‌లో 79 మార్కులతో భూషణ భానుప్రకాష్ రెడ్డి మొదటి ర్యాంకు సాధించారు.

జగన్నాథ రథ చక్రాలు కదిలాయ్..



ప్రపంచ ప్రసిద్ధి పొందిన పూరి జగన్నాథ రథయాత్ర మంగళవారం ప్రారంభమయింది.

లౌకికవాదాన్ని రక్షించే వాళ్లు

ఏకతాటిపైకి రావాలి

23న బీహార్‌లో ప్రతిపక్ష రాజకీయ పార్టీల సమావేశం

హాజరవుతున్న సిపిఎం, కేసీఆర్ కలిసి రావాలి : పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ప్రజాశక్తి-మిర్యాలగూడ



మోడీ 2024లో మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం లౌకికవాదం కనుమరుగవు తుందని, వాటిని రక్షించేవాళ్లు ఏకతాటిపైకి రావాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్నికల వాతావరణం నెలకొందని, అన్ని పార్టీలు ఎన్నికల క్యాంపెయన్‌లు చేస్తున్నాయని తెలిపారు. 2024లో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే అది రాజ్యాంగానికి మరణ శాసనంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి విధానాలను వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలని ఒక వేదికపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే ఈనెల 23న బీహార్‌లో ప్రతిపక్ష రాజకీయ పార్టీల సమావేశం జరగనుందని తెలిపారు. ఈ సమావేశానికి సిపిఎం హాజరవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి కేసీఆర్ కూడా హాజరుకావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. హాజరు కావడం హాజరు కాకపోవడం వారి ఇష్టమని, కానీ బిజెపిని ఓడించడమే లక్ష్యంగా ఉంటే హాజరుపై ఆలోచించాలని కోరారు. తమకు కూడా కేరళలో కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థిగా ఉందని, అయినప్పటికీ బిజెపిని ఓడించాలన్న లక్ష్యంతో, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ముందుకెళ్తున్నామని చెప్పారు. త్వరలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో మోడీ ప్రభుత్వం ప్రమాదకరమైన చట్టాలను తీసుకురాబోతుందని చెప్పారు. ఢిల్లీలో తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక ఆర్డినెన్స్‌ను అన్ని పార్టీలు ఖండించాయని, ఫెడరల్ వ్యవస్థను బలపరచాలన్న లక్ష్యం ఉన్న వారందరూ ఆ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించాలని కోరారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను బలవంతంగా దేశంపై రుద్దేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. దీనివల్ల ప్రజల మధ్య విభజన సృష్టించి మత విద్వేషాలతో రాజకీయాలు చేయాలని చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ప్రజాస్వామ్యవాదు లందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్నిటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం అమ్ముకున్న రైతులకు వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి జాగా ఉన్నవారికి ఐదు లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే పంపిణీ చేయాలని, పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని అన్నారు. పేదలు గుడిసెలు వేసుకుంటే పీకేయడం, కేసులు పెట్టడం సరింది కాదని ఆ చర్యలను మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తీగల సాగర్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర పార్టీకి రూ.16,200 సహాయం

త్రిపుర రాష్టంలో జరుగుతన్న హింసాకాండతో కమ్యునిస్టు పార్టీ కార్యకర్తలు అన్యాయనికి గురౌతున్నారని రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సంఘీభావం తెలుపుతూ.. ఆదుకోవాలని కోరగా ముఖ్య కార్యకర్తలు స్పందించారు. ఎవరికి తోచిన వారు తమ వంతు సహాయంగా అందజేశారు. మొత్తంగా 16,200 రూపాయలు అందించారు. ఆ విరాళాలను త్రిపుర కమిటీకి అందజేస్తామని చెప్పారు.

మార్గదర్శిలో అవకతవకలు

- త్వరలో 23 చిట్స్ సీజ్
- సిఐడి అడిషినల్ డిజి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కంపెనీ చట్ట వ్యతిరేక లావాదేవీలకు పాల్పడిందని ఆంధ్రప్రదేశ్ సిఐడి అడిషినల్ డిజి ఎన్.సంజయ్ అన్నారు. ఇప్పటివరకు అందిన ఆడిట్ నివేదికల ప్రకారం.. ఎపిలోని తొమ్మిది మార్గదర్శి శాఖల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని.. వాటిలోని 23 చిట్స్‌ను త్వరలో సీజ్ చేస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మార్గదర్శి కంపెనీ 108 శాఖలతో 2351 చిట్స్ గ్రూపులను నిర్వహిస్తోందని, త్వరలో అవి కూడా సీజ్‌చేస్తామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్ లేక్ వ్యూ అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

చట్ట వ్యతిరేకంగా చిట్స్ నిర్వహణ, ఖాతాదారుల నిధులు దారిమళ్లింపు, ఇతర చట్ట వ్యతిరేక చర్యల కారణంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ కంపెనీపై కేసు నమోదు చేశామనీ, ఆ సంస్థకు చెందిన రూ.1035 కోట్ల ఎఫ్‌డిలు, మ్యూచ్‌వల్ ఫండ్స్‌లో పెట్టుబడులను అటాచ్ చేశామని చెప్పారు. మార్గదర్శి కంపెనీ మూతపడితే, ఖాతాదారులకు న్యాయం చేయాల్సిన బాధ్యత స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖదేనని స్పష్టంచేశారు. చిట్‌ఫండ్స్ నిర్వహణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 1982లో చట్టం తీసుకొచ్చినా..దాన్ని 26 ఏళ్లు రాష్ట్రంలో ప్రభుత్వాలు అమలుచేయకుండా పెద్ద మనిషి తన పలుకుబడి ఉపయోగించి పెద్ద తప్పుచేశారని రామోజీరావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ కేసు వ్యవహారంలో ప్రభుత్వ అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుంటే, మార్గదర్శిపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని సొంత మీడియాలో రాసుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. చట్టం ప్రకారం చిట్ కంపెనీలు తమ బ్యాలెన్స్ షీట్స్‌ను చిట్ ఫండ్ యాక్టులో పొందుపర్చాలి. కానీ, మార్గదర్శి వారు కంపెనీ యాక్టులో పొందుపర్చి తమదే కరెక్టని వాదిస్తున్నారని అన్నారు. మార్గదర్శి కంపెనీ ఆర్‌బిఐ నిబంధనలు పట్టించుకోలేదని చెప్పారు. చిట్స్ ఖాతాలు ముగిసిన వారి పేర్లు, గుర్తు తెలియని వ్యక్తుల పేర్లూ ఖాతాదారులుగా చూపిస్తున్నారని, పెద్ద మొత్తంలో ఖాతాదారుల సొమ్మును కార్పొరేట్ కార్యాలయానికి తరలించినట్లు తమ విచారణలో తేలిందన్నారు. మార్గదర్శి మోసం అతిపెద్ద ఆర్థిక కుంభకోణమని పేర్కొన్నారు. మార్గదర్శి వ్యవహారంపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కు సమాచారమిస్తామని సంజయ్ తెలిపారు. కంపెనీ అక్రమాలపై అనంతపురం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, నర్సరావుపేట, ఏలూరు, గుంటూరు పోలీస్ స్టేషన్లలో ఏడు కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఈ కేసులో ఎ1 నిందితుడు రామోజీరావును ఒకసారి, ఎ 2 శైలజా కిరణ్‌ను రెండు సార్లు ప్రశ్నించామని సిఐడి అడిషినల్ డిజి సంజయ్ వెల్లడించారు.

పూతలపట్టు ఎస్ఐ సహా ఆరుగురిపై కేసు

- నలుగురు మహిళలపై లైంగిక వేధింపులు
- తమిళనాడులో చికిత్స పొదుతున్న బాధితులు

ప్రజాశక్తి- పూతలపట్టు (చిత్తూరు)

మహిళలకు రక్షణగా నిలువాల్సిన పోలీసులే లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎస్సై హరిప్రసాద్, కానిస్టేబుల్ తనికాచలంతో పాటు మరో నలుగురిపై చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌పి వివరాల మేరకు.. కొన్నిరోజుల క్రితం కల్లూరు వద్ద భారీ చోరీ జరిగింది. ఈ కేసుపై దర్యాప్తు ప్రారంభించిన పూతలపట్టు ఎస్సై హరిప్రసాద్ తన బృందంతో కలిసి తమిళనాడు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ కేసులో పూమది, అయ్యప్పతో సహా ఆరుగురిని అరెస్టు చేశారు. అయితే ముఠాలో నలుగురు నిందితులు మహిళలే. విచారణ అనంతరం ఇద్దరిని రిమాండ్‌కు పంపి మరో నలుగురికి నోటీసులిచ్చి పంపించారు. నలుగురు మహిళలను ఎపి పోలీసులు లైంగికంగా వేధించి హింసించారని తమిళనాడులోని కృష్ణగిరి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో చిత్తూరు ఎస్‌పి రిశాంత్ రెడ్డితో కృష్ణగిరి పోలీసులు మాట్లాడారు. ఈ వ్యవహారంపై ఎస్‌పి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం కృష్ణగిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి ప్రాథమిక నివేదిక తీసుకోవాలని నగరి అర్బన్ సీఐ వాసంతికి ఆదేశించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు పూతలపట్టు ఎస్సై హరిప్రసాద్, కానిస్టేబుల్ తనికాచలంతో పాటు మరో నలుగురిపై చిత్తూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఈ కేసుపై చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసరావును విచారణ అధికారిగా నియమించారు.

మమతా సర్కారుకు సుప్రీంలో ఎదురుదెబ్బ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమబెంగాల్ పంచాయతీ ఎన్నికల వేళ మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అధికార టిఎంసి గూండాల హింసాత్మక దాడులు పెచ్చుమీరిన నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు కేంద్ర భద్రతా బలగాలను మోహరించాలంటూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్లను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. ఈ సందర్భంగా ఆయా పిటిషన్లను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. బెంగాల్‌లో ఒకేరోజులో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నందున స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, సజావుగా ఎన్నికలు జరగాలన్నదే హైకోర్టు ఆదేశాల వాస్తవ ఉద్దేశమని స్పష్టం చేసింది. ఎన్నికలు నిర్వహించడం హింసకు లైసెన్స్ కాదని జస్టిస్ నాగరత్న అన్నారు. నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఒక లక్షణమని తెలిపారు.

ఆస్ట్రేలియా సంచలనం

తొలిటెస్ట్‌లో ఇంగ్లండ్‌పై రెండు వికెట్ల తేడాతో గెలుపు



బర్మింగ్‌హామ్: యాషెస్ సిరీస్ తొలిటెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు సంచలనం నమోదుచేసింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 282పరుగుల లక్ష్యాన్ని 8వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ కమిన్స్(44నాటౌట్), లియాన్(16నాటౌట్) ఆస్ట్రేలియా గెలుపులో కీలకపాత్ర పోషించారు. వీరిద్దరూ కలిసి 9వ వికెట్‌కు అజేయంగా 55పరుగులు జతచేశారు. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 107 పరుగులతో మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా తొలుత బోలండ్(20) వికెట్‌ను కోల్పోయింది. ఓపెనర్ ఖవాజా(65; 197బంతుల్లో 7ఫోర్లు) ఇంగ్లండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. హెడ్(16), గ్రీన్(28), క్యారీ(20) నిరాశపరిచారు. బ్రాడ్‌కు మూడు, రాబిన్సన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కమిన్స్‌కు లభించింది. దీంతో ఐదు టెస్ట్ యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యతలో నిలవగా.. రెండోటెస్ట్ 28నుంచి లార్డ్స్‌లో ప్రారంభం కానుంది.

ప్రమోద్‌కు మూడు పతకాలు



ఒట్టావా: కెనడా పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ టోర్నీలో భారత షట్లర్ ప్రమోద్ భగత్ సత్తా చాటాడు. సింగిల్స్‌లో రజతం, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకాలు గెలుచుకున్నాడు. సింగిల్స్ ఫైనల్లో ప్రమోద్ 12-21, 13-21తో డానియల్ బేతెల్ చేతిలో ఓడాడు. పురుషుల డబుల్స్‌లో సుకాంత్ కదమ్ జోడీగా కాంస్యం నెగ్గిన భగత్... మిక్స్‌డ్ డబుల్స్‌లో మనీషా రాందాస్ జంటగా రజత పతకం గెలిచాడు.

సరిహద్దుల్లో శాంతి నెలకొంటేనే చైనాతో పురోగతి

- అమెరికాతో బంధం బలోపేతం
- వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, వాషింగ్టన్ : భారత్ శాంతికి తొలి ప్రాధాన్యత ఇస్తుందని, ఈ విషయం యావత్ ప్రపంచానికి తెలుసునని ప్రధాని మోడీ అన్నారు. ఈ విషయంలో భారత్ పట్ల ప్రపంచ దేశాలకు విశ్వాసం వుందని అన్నారు. ఆయన అమెరికా పర్యటనకు మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనకు ముందుగానే ఆయన వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత్ తటస్థంగా లేదని శాంతి వైపే వుందని స్పష్టం చేశారు. ఈ అంశంపై భారత్ తీసుకున్న వైఖరిపై అమెరికాలో ఎలాంటి విమర్శలు లేవని కూడా ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థల్లో మార్పులు రావాలని మోడీ అన్నారు. బహుళ ధృవ ప్రపంచ వ్యవస్థ పెరగాలని, అందుకు గానూ భారత్ వంటి దేశాలకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని చెప్పారు. అసలు శాశ్వత సభ్య దేశాల జాబితాలో భారత్ వుండాలో లేదో ప్రపంచ దేశాలనే అడగాలని మోడీ పేర్కొన్నారు.

సరిహద్దుల్లో శాంతి నెలకొన్నప్పుడే చైనాతో భారత్ సంబంధాల్లో పురోగతి సాధ్యం కాగలదని ఒక ప్రశ్నకు సమాధానంగా మోడీ చెప్పారు. చైనాతో సాధారణ ద్వైపాక్షిక సంబంధాలు నెలకొనాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతిభద్రతల స్థాపన తప్పనిసరి అని మోడీ ఆ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తూ, చట్ట బద్ధ పాలన అమలు చేస్తూ, విబేధాలను, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని భారత్ ధృఢంగా నమ్ముతుందని అన్నారు. అదే సమయంలో తన సార్వభౌమాధికారాన్ని, గౌరవాన్ని కాపాడుకోవడానికి పూర్తి స్థాయిలో సన్నద్ధమై వుందని, దానికే కట్టుబడి వుందని మోడీ స్పష్టం చేశారు.

నేడు సెంథిల్ బాలాజీకి శస్త్రచికిత్స

చెన్నై : ఇడి అరెస్టు చేసిన తమిళనాడు మంత్రి వి.సెంథిల్‌బాలాజీకి ఈ నెల 21న ఇక్కడి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో హృదయ సంబంధిత శస్త్రచికిత్సను చేయనున్నారు. ఈ విషయాన్ని తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి సుబ్రమణ్యం మంగళవారం వెల్లడించారు. క్యాష్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో గతవారంలో సెంథిల్‌బాలాజీని ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అదే రోజు ఆయన గుండెపోటుకు గురికావడంతో తొలుత ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత కోర్టు ఆదేశాలతో కావేరి ఆసుపత్రికి తరలించారు.

కాశ్మీర్‌లో ఎస్ఐఎ సోదాలు

శ్రీనగర్ : సోషల్ మీడియా దుర్వినియోగానికి సంబంధించిన కేసులో జమ్ముకాశ్మీర్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎస్ఐఎ) మంగళవారం సోదాలు జరిపింది. లోయలోని నాలుగు జిల్లాల్లోని ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. పలు మొబైల్ ఫోన్స్, సిమ్ కార్డులతోపాటు ఇతర డిజిటల్ వస్తువులను సీజ్ చేసినట్లు వివరించారు. వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వేర్పాటువాద, భారత వ్యతిరేక భావాలను ప్రచారం చేయడంలో ప్రమేయం ఉన్న వ్యక్తులు, బృందాలను గుర్తించే లక్ష్యంతో ఈ సోదాలు చేపట్టినట్లు తెలిపారు. కుప్వారా, అనంతనాగ్, పుల్వామా, శ్రీనగర్ జిల్లాల్లో ఎస్ఐఎ బృందాలు సోదాలు జరిపాయని చెప్పారు. భారతదేశంపై ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి, ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడానికి సోషల్ మీడియా సంస్థలు తమ విదేశీ సహచరులకు సహకరిస్తున్నాయన్న ఎస్ఐఎ కాశ్మీర్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపింది.

ఆక్రమిత ప్రాంతాల్లో నిర్మాణాలు చట్టవిరుద్ధం

- ఇజ్రాయిల్ చర్యలను ఖండించిన పాలస్తీనా


జెరూసలేం : వెస్ట్ బ్యాంక్‌లో ఆవాసాల నిర్మాణాన్ని వేగిరపరచాలన్న, విస్తరించాలన్న ఇజ్రాయిల్ ప్రభుత్వ నిర్ణయాన్ని పాలస్తీనియన్లు తీవ్రంగా ఖండిస్తున్నారని పాలస్తీనా అధ్యక్ష ప్రతినిధి నబిల్ అబూ రుదినెహ్ తెలిపారు. ఈ ఆవాసాల ప్రణాళికకు, నిర్మాణానికి ఇన్‌చార్జిగా ఆర్థిక మంత్రి బెజలాల్ మాట్రిచ్‌ను నియమించడాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. "ఆక్రమిత ప్రాంతాల్లో ఏ నిర్మాణమైనా చట్టవిరుద్ధమే, తిరస్కరించాల్సిందే, ఎక్కడైనా అది చట్టబద్ధంగా విచారించాల్సిన అంశమే." అని ఆయన వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ చట్టాలను, కుదుర్చుకున్న ఒప్పందాలను ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తోందన్నారు. నిప్పుతో ఇజ్రాయిల్ చెలగాటమాడుతోందన్నారు. ఇటువంటి వ్యవహార శైలి క్షేత్రస్థాయిలో మరింత ఉద్రిక్తతలకు దారి తీస్తుందన్నారు. ఆంక్షలను దాటేందుకు ఇజ్రాయిల్‌ను అనుమతించినందుకు అమెరికాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నిర్ణయం లేకుండా ఇజ్రాయిల్ ఒక్క రాయి కూడా వేయలేదన్నారు.

మద్దతివ్వండి :అమెరికాను కోరిన పాలస్తీనా ప్రధాని

రమల్లా : రెండు దేశాల ఏర్పాటు పరిష్కారాన్ని కాపాడేందుకు సీరియస్‌గా చర్యలు తీసుకోవాల్సిందిగా పాలస్తీనా ప్రధాని మహ్మద్ ఇషయె సోమవారం అమెరికాను కోరారు. స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటును గుర్తించాలన్నారు. అమెరికా విదేశాంగ శాఖలోని నియర్ ఈస్ట్రన్ ఎఫైర్స్ (ఎన్ఐఎ) సహాయ విదేశాంగ మంత్రి బార్బారా లీఫ్ నేతృత్వంలోని అమెరికా ప్రతినిధి బృందంతో సమావేశం సందర్భంగా పాలస్తీనా ప్రధాని ఈ విజ్ఞప్తి చేశారని అధికార ప్రకటన పేర్కొంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థలో పాలస్తీనా చేరేందుకు మద్దతునివ్వాలిందిగా ఆయన కోరారు. ఐక్యరాజ్య సమితిలో పూర్తి స్థాయి సభ్యత్వాన్ని కోరుతున్న పాలస్తీనాను సమర్ధించాల్సిందిగా కోరారు.

హక్కుల దుర్వినియోగాన్ని ఖండించండి

- మణిపూర్ హింస నేపథ్యంలో ఆహ్వానం సరికాదు
- మోడీ సర్కారు తీరుపై బైడెన్‌కు హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్ గ్రూపు లేఖ
- లేఖపై 58 సంస్థలు, 200 మందికి పైగా వ్యక్తుల సంతకాలు
- అమెరికాకు బయలుదేరిన భారత ప్రధాని


బైడెన్‌తో మోడీ (ఫైల్)

న్యూఢిల్లీ : భారత ప్రధాని మోడీ అమెరికా పర్యటన బుధవారం నుంచి అధికారికంగా ప్రారంభం కానున్నది. ఈ పర్యటన కోసం ఆయన ఇప్పటికే భారత్ నుంచి బయలుదేరారు. మోడీ అమెరికా పర్యటన నేపథ్యంలో కొన్ని సంస్థలు, వ్యక్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. భారత్‌లో హక్కుల దుర్వినియోగం, విమర్శకులపై మోడీ సర్కారు వ్యవహరిస్తున్న తీరును ఉటంకిస్తూ అమెరికాలోని లాభాపేక్షలేని గ్రూపు అయిన హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్ (హెచ్ఆర్‌హెచ్) అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఒక లేఖ రాసింది. మోడీ సర్కారు తీరును వ్యతిరేకిస్తూ బహిరంగంగా ఖండించాలని కోరింది. ఈ లేఖపై 58 సంస్థలు, 200 మందికి పైగా వ్యక్తులు సంతకాలు చేశారు.

భారత్‌లో మానవ హక్కుల సంక్షోభాన్ని పరిష్కరించడానికి మార్గాలు అన్వేషించటం కోసం.. భారతీయ–అమెరికన్ మానవ హక్కుల, పౌర సమాజ నాయకులతో చర్చించాలని అమెరికా అధ్యక్షుడిని హెచ్ఆర్‌హెచ్ కోరింది. బైడెన్.. మోడీని వ్యక్తిగతంగా విమర్శించడానికి ఇష్టపడకపోయినా.. అధికారాన్ని ఏకీకృతం చేయడానికి, భారత ప్రజల అభీష్టాన్ని దెబ్బతీసేందుకు భారత ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని, ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేయడాన్ని విమర్శించడానికి తగినంత అవకాశం ఉన్నదని పేర్కొన్నది. "మీరు మాట్లాడితే ప్రధాని మోడీ వింటారు. మీరు బహిరంగంగా ఒక స్టాండ్ తీసుకుంటేనే అతను, అతని మిత్రులు మారుతారు. భారత్ గురించి పట్టించుకునే మీ మాట వినాలనీ, భారత్‌లో ప్రజల భవిష్యత్తును, హక్కులను ఒక వ్యక్తి దొంగిలించలేడని నిర్ధారించుకోవాలని మేము మిమ్మల్ని కోరుతున్నాం" అని లేఖలో వివరించింది.

మోడీకి వ్యతిరేకంగా ర్యాలీ

మణిపూర్‌లో జాతి హింస చెలరేగిన నేపథ్యంలో మోడీని అమెరికా పర్యటనకు ఆహ్వానించటంపై హెచ్ఆర్‌హెచ్ బైడెన్‌ను తప్పుబట్టింది. హెచ్ఆర్‌హెచ్ లేఖ ప్రకారం.. మానవ హక్కులపై భారత ప్రభుత్వం పెంచుతున్న దాడులకు వ్యతిరేకంగా బహిరంగంగా, అర్థవంతంగా వెనక్కి నెట్టాలని కోరింది. మానవ హక్కుల పట్ల కట్టుబాట్లను గౌరవించాలని భారత ప్రభుత్వానికి బహిరంగంగా పిలుపునివ్వాలని, రాజకీయ విమర్శకులను ఏకపక్షంగా నిర్బంధించడానికి చట్టాలను ఉపయోగిస్తున్న మోడీ, ఆయన క్యాబినెట్‌ను హెచ్చరించాలని చెప్పింది. మోడీకి, ఆయన ఫాసిస్టు పాలనలో మానవ హక్కులు, ముఖ్యంగా మైనారిటీల హక్కులు ప్రమాదంలోకి పడిపోవటానికి వ్యతిరేకంగా బుధవారం అమెరికాలో ఒక ర్యాలీ జరగనున్నది. ఈ ర్యాలీ స్పాన్సర్లలో హెచ్ఆర్‌హెచ్ కూడా ఉన్నది.

భారత ప్రజాస్వామ్యంపై మూడు దాడులు

సమ్మిట్ ఫర్ డెమొక్రసీకి వారం ముందు భారత ప్రజాస్వామ్యంపై వరుసగా మూడు దాడులను లేఖ ప్రస్తావించింది. "మొదట, అధికార బిజెపి రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి బహిష్కరించింది. రెండోది, భారత ప్రభుత్వం పంజాబ్‌లో ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. మూడోది, ఉగ్రవాదానికి సంబంధించి భారతీయులను దోషులుగా గుర్తించవచ్చని భారత సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది" అని లేఖలో పేర్కొన్నది. బైడెన్ ప్రభుత్వంలో వీటి గురించి ఎవరూ మాట్లాడలేదు అని వివరించింది. ఇస్లామోఫోబిక్ హింస భారత్‌ను పట్టుకున్న తర్వాత సమ్మిట్ ఫర్ డెమొక్రసీలో మాట్లాడాలని మీరు(బైడెన్) మోడీని ఆహ్వానించారు అని ఆందోళన వ్యక్తం చేసింది.

మోడీ పాలనలో నిరంకుశ దేశంగా భారత్

భారత–అమెరికన్ హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, దళితులు, పౌర హక్కులు, మతాంతర సంస్థల కూటమి అయిన కొయలిషన్ ఫర్ రీక్లెయిమింగ్ ఇండియన్ డెమొక్రసీ.. మోడీని ఆహ్వానించాలనే బైడెన్ నిర్ణయానికి, భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా వాషింగ్టన్ డీసీలో రెండు విలేకరుల సమావేశాలను నిర్వహించనున్నది. మోడీ పాలనలో భారత్.. ప్రపంచంలో అత్యంత వేగమైన నిరంకుశ దేశాలలో ఒకటని ఈ కూటమి పేర్కొంది. గత మూడేళ్లుగా భారత్‌ను మోడీ ప్రభుత్వం 'పాక్షిక స్వేచ్ఛా' దేశంగా తయారుచేసిందని 'ఫ్రీడమ్ హౌజ్' వివరించింది. మోడీ సర్కారు కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన తర్వాత అక్కడ మానవ, పౌర, రాజకీయ హక్కుల ఉల్లంఘన జరిగిందనీ, కాశ్మీర్ స్వేచ్ఛా ప్రాంతం కాదని ఆరోపించింది.

పత్రికా స్వేచ్ఛ ర్యాంకింగ్–2023లో భారత్ స్థానం 161కి పడిపోయిందనీ, అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల హత్యల జవాబుదారీతనాన్ని పరిశీలించే సూచీలో 15 ఏళ్లుగా భారత్ ఉన్నదనీ, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా భారత 11వ స్థానంలో ఉన్నదని హెచ్ఆర్‌హెచ్ వివరించింది. ప్రపంచవ్యాప్తంగా రచయితలను జైలుకు పంపిన టాప్–10 దేశాలలో భారత్ ఒకటని 2022 పెన్ అమెరికాస్ ఫ్రీడమ్ టు రైట్ ఇండెక్స్‌ను ఉటంకించింది.

2017 నుంచి ప్రతి ఏడాదీ సామూహిక దురాగతానికి గురయ్యే ప్రమాదంలో ఉన్న టాప్–15 దేశాలలో భారత్ ఒకటిగా ఉన్నదనీ, ఇది మోడీ హయాంలో భారత రాజకీయాల విషపూరితను ప్రతిబింబిస్తుందన్న యుఎస్ హోలోకాస్ట్ మెమోరియల్ మ్యూజియం వెల్లడించిన అంశాన్ని హెచ్ఆర్‌హెచ్ గుర్తు చేసింది. కౌన్సిల్ ఆన్ అమెరికన్–ఇస్లామిక్ రిలేషన్స్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అమెరికన్ క్రిస్టియన్ ఆర్గనైజేషన్స్, ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్, ఇంటర్నేషనల్ కమిషన్ ఫర్ దళిత్ రైట్స్‌తో పాటు పలు సంస్థలు ఈ లేఖపై సంతకాలు చేసిన వాటిలో ఉన్నాయి.

ఆ పార్టీలపై చర్యలు తీసుకోండి

- ఎన్నికల కమిషన్‌కు ఎడిఆర్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ అభ్యర్థుల నేర చరిత్రను ప్రచురించడంలో విఫలమైన రాజకీయ పార్టీలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు ఎడిఆర్ లేఖరాసింది. సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల స్థాయిలో తమ అభ్యర్థుల నేర చరిత్ర, పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి రాజకీయ పార్టీలు వెల్లడించడం తప్పనిసరి అని ఎడిఆర్ తన లేఖలో గుర్తు చేసింది. నేర చరిత్ర ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయడానికి గల కారణాలను, నేరచరిత్ర లేని ఇతర వ్యక్తులను అభ్యర్థులుగా ఎందుకు ఎంపిక చేయలేకపోయారనే విషయాలను కూడా రాజకీయ పార్టీలు వెల్లడించాల్సి ఉంటుందని ఎడిఆర్ తెలిపింది. తన ఆదేశాలను పాటించనందుకు 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 రాజకీయ పార్టీలకు సుప్రీంకోర్టు జరిమానా విధించిన విషయాన్ని ఎడిఆర్ గుర్తు చేసింది. దీని తరువాత ఈ ఏడాదిలో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు, 2022లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, పంజాబ్ ఎన్నికలు, 2021లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతం) అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని ఎడిఆర్ తెలిపింది. ఈ ఎన్నికల్లో నిబంధనలు పాటించని రాజకీయ పార్టీలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

కజిరంగ పార్క్ హైవేపై పనిచేయని స్పీడ్‌గన్లు

గౌహతి : కజిరంగ నేషనల్ పార్క్ అండ్ టైగర్ రిజర్వ్‌కి చుట్టు పక్కల ఉన్న జాతీయ రహదారిలో 44 కిలోమీటర్ల విస్తీర్ణంలో స్పీడ్ సెన్సార్లు ఫిబ్రవరి నుంచి పనిచేయడం లేదు. జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) వరస ఆదేశాల మేరకు కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నెల రోజుల్లోపే కొన్ని స్పీడ్ సెన్సార్లు పనిచేయకపోవడం విశేషం.

ఈ విషయంపై అస్సాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబన్ కుమార్ బర్ధకూర్‌కు పర్యావరణ ఉద్యమకారుడు రోహిత్ చౌదరి ఒక రిమైండర్‌ను మంగళవారం సమర్పించారు. 'నిర్దేశించిన జంతు కారిడార్లలో అమర్చిన ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజింగ్ (ఎఎన్‌పిఆర్)ను మళ్లీ పనిచేసే విధంగా ఆదేశాలు ఇవ్వండి' అని రోహిత్ చౌదరి తన లేఖలో కోరారు. ఇవి ఫిబ్రవరి 1 నుంచి పనిచేయడం లేదని కూడా లేఖలో ప్రస్తావించారు. ఈ కెమెరాల నిర్వహణ కోసం 2022–23 బడ్జెట్‌లో రూ.4.95 కోట్లను కేటాయించారు. కెమెరాలు పనిచేయకపోవడంతో వాహనాలు గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నాయని, స్పీడ్‌గన్లు పనిచేస్తే ఎన్‌జిటి నిర్దేశించిన విధంగా గంటకు 40 కిలోమీటర్లు లోపు వెళ్లడానికి సహాయపడతాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో వరదలు విజృంభిస్తున్న సమయంలో స్పీడ్‌గన్లు పనిచేయాల్సిన అవసరాన్ని రోహిత్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వరదలతో ముంపునకు గురైన ప్రాంతాల నుంచి కొండలు, ఎత్తయిన ప్రదేశాలు చేరుకోవడానికి జంతువులు జాతీయ రహదారి దాటుతుంటాయి. అస్సాంలో మూడు జిల్లాల్లో కజిరంగ పార్క్ విస్తరించి ఉంది.

మణిపూర్ హింసాకాండపై మౌనం వీడండి

- ప్రధాని మోడీకి ఆ రాష్ట్ర మహిళల డిమాండ్



జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న మణిపూర్ మహిళలు

న్యూఢిల్లీ : ఇంఫాల్‌లోని మహిళలు నిర్వహిస్తున్న 'ఎమా కైథల్ ' లేదా ' మదర్స్ మార్కెట్' ప్రతినిధులు రాష్ట్రంలో హింసాత్మక పరిస్థితులపై ప్రధాని మౌనం వీడి .. చర్యలు చేపట్టాలంటూ మోడీకి ఓ సందేశాన్ని పంపారు. వీరంతా హిందూ, పంగల్ ముస్లిం వర్గాలకు చెందిన మెయితేలు. మణిపూర్‌లో హింసను నిరోధించేందుకు, రాష్ట్ర సమగ్రతను కాపాడేందుకు ప్రధాని చర్యలు చేపట్టాలని ఆ సందేశంలో పేర్కొన్నారు. హింసాకాండలో ప్రాణాలు కోల్పోతున్న పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సోమవారం న్యూఢిల్లీ చేరుకున్న ప్రతినిధుల బృందం జంతర్ మంతర్‌లో ఆందోళన చేపట్టింది. మెయితే భాషలో అనువాదకుల ద్వారా వారు మీడియాకు అక్కడి పరిస్థితు లను వివరించారు. ఆస్తి, నగలు నష్టాన్ని పునరుద్ధరించుకోవచ్చు, కానీ ప్రాణనష్టం అలా కాదని బినోదిని అనే ప్రతినిధి పేర్కొన్నారు. కొండలు, అడవులు తేడా లేకుండా అగ్నికి ఆహుతవుతున్నాయి. అక్కడి తల్లులు, యువకులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి తమ కష్టాలు తెలిపేందుకు ఇక్కడకు వచ్చామని .. రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులను అడ్డుకునేలా ప్రధాని జోక్యం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న హింసాకాండపై ప్రధాని మోడీ స్పందించలేదని, కనీసం రాష్ట్రాన్ని సందర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతి ప్రాతిపదికన రాష్ట్రాన్ని విభజించాలని మోడీ ప్రభుత్వం భావిస్తోందా అని వారు ప్రశ్నించారు. హింస ప్రారంభమైన 25 రోజుల తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పర్యటించారని, రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని మరో ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్ షా పర్యటన సమయంలోనూ రాష్ట్రంలో హింస నెలకొందని మరో ప్రతినిధి పేర్కొన్నారు. ఈ హింసాకాండలో అధికశాతం మంది యువకులు ప్రాణాలు కోల్పోతున్నారని, తమ పిల్లలకు బదులుగా తల్లులమైన తాము ఇక్కడ ప్రాణ త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నామని మరో ప్రతినిధి తెలిపారు. మృతులకు రూ. 10 లక్షల పరిహారం అందిస్తామని హోం మంత్రి ప్రకటించారని, తాము డబ్బు కోరుకోవడం లేదని, రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు మెరుగైన చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నామని మరో ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రికి పలు మెమొరాండంలు సమర్పించామని, ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు.

బోరిస్ జాన్సన్‌పై సభా కమిటీ నివేదికకు ఎంపీల ఆమోదం

- చర్చలో పాల్గొనని ప్రధాని రిషి సునాక్
- సిగ్గుచేటన్న లేబర్ పార్టీ నేతలు



లండన్ : కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో తన నివాసంలో పార్టీలు జరిగాయన్న విషయంపై బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ అసత్యాలు చెప్పారని, ఉద్దేశపూర్వకంగానే పార్లమెంట్‌ను తప్పుదారి పట్టించారని బ్రిటన్ ప్రతినిధుల సభ నిర్ధారిస్తూ ఇచ్చిన నివేదికను పార్లమెంట్ సభ్యులు సోమవారం అత్యధిక మెజారిటీతో ఆమోదించారు. 354 మంది ఎంపీలు నివేదికను సమర్ధిస్తూ, మాజీ ప్రధాని చర్యలను ఖండిస్తూ ఓటు వేయగా, ఏడుగురు సభ్యులు మాత్రమే వ్యతిరేకించారు. ప్రధాని రిషి సునాక్, ఇతర టోరీ ఎంపీలు పలువురు ఈ చర్చలో పాల్గొనరాదని నిర్ణయించుకున్నారు. ప్రతిపక్ష లేబర్ పార్టీ ఎంపిలు, మాజీ ప్రధాని థెరిస్సా మేతో సహ పలువురు టోరీ సభ్యులు పాల్గొన్న ఈ చర్చ గంటల తరబడి సుదీర్ఘంగా సాగింది. ఓటింగ్‌కు ముందు మాజీ ప్రధాని వ్యవహార శైలిపై ప్రతినిధుల సభలో జరిగే చర్చలో పాల్గొంటారా లేదా అంశాన్ని తేల్చడానికి కూడా ప్రధాని రిషి సునాక్ తిరస్కరించారు. ఆ నేపథ్యంలో లేబర్ నేత సర్ కెయిర్ స్టార్మర్ మాట్లాడుతూ, "ప్రధాని, నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాలి, మాతో కలిసి రండి, లాబీలో చేరండి, దీనిపై ఏమనుకుంటున్నారో మాకు చెప్పండి." అని పేర్కొన్నారు. ఈ విషయంలో చర్చలో పాల్గొని ఓటువే యడానికి భయపడుతున్నారని ఆరోపిం చారు. లిబరల్ డెమొక్రటిక్ డిప్యూటీ నేత డైసీ కూపర్ మాట్లాడుతూ, "ఈ తీర్మానానికి మద్దతి వ్వడానికి తిరస్కరిస్తే, అది, కోవిడ్ సమయంలో ఒంటరిగా ఇబ్బందులుపడి దు:ఖించిన కుటుంబాల కు అవమానం కాగలదు." అని వ్యాఖ్యానించారు. నిజాయితీగా పాలన సాగిం చాలని ప్రధాని భావించినట్లైతే ఈ ఓటింగ్‌లో పాల్గొనడానికి ప్రధాని వెనుకడుగు వేయరాదని అన్నారు. ఈ దేశ ప్రధానిగా ఇలా వ్యవహరించ డం సిగ్గుచేటైన అంశమని, ఇది విధులను నిర్లక్ష్యం చేయడమే కాగలదని లేబర్ పార్టీ ఎంపి జెస్ ఫిలిప్స్ వ్యాఖ్యానించారు. ప్రజలకు ఒక రూల్, నేతలకు మరో రూల్ కాదన్న విషయం తెలుసుకోవాలని అందరూ ఒకేలా నిబంధనలు పాటించాల్సిన అవసరం వుందని చర్చలో పాల్గొన్న పలువురు టోరీ సభ్యులు పేర్కొన్నారు. జాన్సన్ మద్దతు దారులు పలువురు తమ నేతకు మద్దతిచ్చారు. నివేదికలోని అంశాలు తెలిసిన వెంటనే జాన్సన్ తన పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారు.



వాటికన్‌లో క్యూబా అధ్యక్షులు

వాటికన్ సిటీ : పోప్ ఫ్రాన్సిస్‌తో సమావేశం కోసం క్యూబా అధ్యక్షులు మిగ్యుల్ డియాజ్ కానెల్ బెర్ముడెజ్ మంగళవారం వాటికన్‌కు చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు (స్థానిక సమయం ప్రకారం) వాటికన్ చేరుకున్న కానెల్‌కు పోంటిఫికల్ హౌస్ హోల్డ్ ప్రిఫెక్చర్ హెడ్, ప్రోటోకాల్ ఇన్‌ఛార్జ్ మోన్సిగ్నోర్ లియోనార్డో సపియెంజా స్వాగతం పలికారు. వాటికన్ ప్రధాన కార్యాలయంలో పోప్ ఫ్రాన్సిస్‌తో కానెల్ సమావేశం జరిపారు. పూర్తిగా ప్రైవేటుగా ఈ సమావేశం 40 నిమిషాలు పాటు జరిగింది. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకూ యూరప్‌లో బెర్ముడెజ్ పర్యటిస్తున్నారు. పోప్ ఫ్రాన్సిస్‌తో భేటీ అయిన తరువాత ఇటలీ అధ్యక్షులు, ప్రధానమంత్రితో కూడా కానెల్ సమావేశం కానున్నారు.

కుకీ గిరిజనుల రక్షణపై అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కృతి

న్యూఢిల్లీ : మణిపూర్ జాతుల మధ్య ఘర్షణలు, హింస అనేది పూర్తిగా శాంతి భద్రతల అంశమని సుప్రీంకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. సైన్యం లేదా కేంద్ర భద్రతా బలగాలను మోహరించాల్సిందిగా కోర్టులను కోరబోరని ఆశిస్తున్నామని పేర్కొంది. కుకీ గిరిజనులకు సైనిక రక్షణ కల్పించాలంటూ మణిపూర్ గిరిజన వేదిక ఢిల్లీ (ఎంటిఎఫ్‌డి) దాఖలు చేసిన పిటిషన్‌ను ఒకటి రెండు రోజుల్లో అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ తిరస్కరించింది. వేసవి సెలవులు ముగిసిన తర్వాత జులై 3వ తేదీన విచారిస్తామని తెలిపింది. ఈ దశలో ఏదో ఒక రకంగా కోర్టు జోక్యం చేసుకుంటే రాష్ట్రంలో పరిస్థితి మరింత పెచ్చరిల్లుతుందని బెంచ్ పేర్కొంది. మే 3వ తేదీ నుండి కుకీ, మెయితీ కమ్యూనిటీల మధ్య ఘర్షణలు తలెత్తాయి. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పే విషయంలో ప్రభుత్వాన్ని నమ్మాలని, ప్రభుత్వం ఆ దిశగానే పనిచేస్తోందని బెంచ్ మౌఖిక వ్యాఖ్యలు చేసింది. మణిపూర్, కేంద్ర ప్రభుత్వాల తరపున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, భద్రతా బలగాలు క్షేత్రస్థాయిలో శాయశక్తులా కృషి చేస్తున్నాయని చెప్పారు.

వేడి తీవ్రతపై కేంద్రంలో చలనం

- రాష్ట్రాలకు బృందాలు

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని అనేక రాష్ట్రాల్లో వేడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో చలనం వచ్చింది. పలు రాష్ట్రాల్లో ఉన్న వేడి తీవ్రతను గుర్తించి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ కీలక సమీక్ష నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ, భారత వాతావరణ విభాగం (ఐఎండి) సీనియర్ అధికారులతో కేంద్ర మంత్రి సమీక్షించారు. వేడి తీవ్రత ఉన్న రాష్ట్రాల్లో పర్యటించేందుకు కేంద్ర ఆరోగ్యశాఖ, ఐఎండి విభాగానికి చెందిన ఐదుగురు అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం తీవ్రంగా వేడి ప్రభావితమైన రాష్ట్రాలను సందర్శిస్తుందని మన్సుఖ్ మాండవీయ తెలిపారు. వేడి గాలులు, వాతావరణ పరిస్థితుల, ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి చర్యలను సూచించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్)ని కూడా ఆదేశించినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు. వేడి తీవ్రత ప్రభావం సాధారణ ప్రజలపై చూపకుండా ఉండేందుకు తగిన సూచనలు, సలహాలు చెప్పాలని ఐసిఎంఆర్‌ను కేంద్రం కోరింది. ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, విదర్భ, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కేంద్ర బృందం పర్యటించనుంది. గత కొన్ని రోజులుగా పలు రాష్ట్రాల్లో వేడి గాలులు, వాతావరణ పరిస్థితి కారణంగా మరణాలు నమోదు కావడంతో కేంద్రం చర్యలు మొదలుపెట్టింది. ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. గత నాలుగు రోజుల్లో దాదాపు 68 మంది వేడి తీవ్రతకు మరణించారు. మరో 450 మంది ఆస్పత్రిలో చేరారు. బీహార్‌లో 44 మంది మరణించారు.


అస్సాంలోని వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన ఇళ్లు

అస్సాంలో వరద ఉధృతి

- 10 జిల్లాల్లో తీవ్ర ప్రభావం


గౌహతి : అస్సాంలో వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. మంగళవారం నాటికి 10 జిల్లాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉందని, ఈ జిల్లాల్లో ఇప్పటికే సుమారు 31 వేల మంది వరదలతో ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తెలిపారు. మరోవైపు అస్సాంలో రాబోయే ఐదు రోజుల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. రెడ్‌ఎలర్ట్ జారీ చేసింది. అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎఎస్‌డిఎంఎ) విడుదల చేసిన డైలీ ఫ్లడ్ రిపోర్టు ప్రకారం చిరాగ్, దర్రాంగ్, ధేమాజి, ధుబ్రి, దిబ్రూగఢ్, కొక్రాఝూర్, లఖీంపూర్, నల్బరి, సోనిట్‌పూర్, ఉదల్‌గురి జిల్లాల్లో 30,700 మందికి పైగా ప్రజలు వరదల బారినపడ్డారు. ఏ జిల్లాలోనూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. 25 పంపిణీ కేంద్రాల ద్వారా సహాయక సామాగ్రిని అందజేస్తున్నారు. ప్రస్తుతం 444 గ్రామాలు ముంపులో ఉన్నాయని, 4,741.23 హెక్టార్లల్లో పంటలు నాశనమయ్యాయని ఎఎస్‌డిఎంఎ తెలిపింది. అనేక ప్రాంతాల్లో కోతలు ఏర్పడుతున్నాయని, కొండచరియలు విరిగి పడుతున్నాయని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా రోడ్లు, వంతెనలు వంటి మౌలిక సదుపాయాలు ధ్వంసమవుతున్నాయని వెల్లడించింది. పట్టణ ప్రాంతాలు కూడా వరద ముంపునకు గురవుతున్నాయని తెలిపింది. బ్రహ్మపుత్రా నదితో సహా రాష్ట్రంలో అన్ని నదులు ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయని పేర్కొంది.

ఐఎఎస్‌లతో పాలన అడ్డుకుంటున్నారు

- కేంద్రంపై కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ఐఎఎస్ అధికారులతో ఢిల్లీ పాలనను నియంత్రించాలని భావిస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు ప్రకటించారు. మంగళవారం నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్‌సిసిఎస్‌ఎ) మొదటి సమావేశానికి హాజరైన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఎన్నికైన ప్రభుత్వ అధికారాలను లాక్కుందని అన్నారు. మండిపడ్డారు. మంత్రులకు బదులుగా అధికారులకు బాధ్యతలను కట్టబెట్టిందని, ఆర్డినెన్స్ ఢిల్లీ చీఫ్ సెక్రటరీని కేంద్రం కన్నా ఉన్నత స్థానంలో ఉంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు తీసుకున్న నిర్ణయాలను తోసిపుచ్చే అధికారం ఐఎఎస్‌లకు ఉందని అన్నారు. ఎన్‌సిసిఎస్‌ఎ సమావేశానికి కొద్ది రోజుల ముందు ఓ అధికారి సస్పెన్షన్‌కు సంబంధించిన ఫైల్ తనకు అందిందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. కొన్ని ప్రశ్నలు లేవనెత్తడంతో ఆ ఫైల్ తిరిగి తన దగ్గరకు రాకుండా.. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయానికి వెళ్లిందని.. ఎన్‌సిసిఎస్‌ఎకి చెందిన ఇద్దరు సభ్యులు ఆమోదించడంతో ఆ అధికారి సస్పెండ్ అయ్యారని అన్నారు. త్వరలో ఆర్డినెన్స్‌తో పాటు ఈ అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నామని తెలిపారు.

సల్మాన్ రష్దీకి ప్రతిష్టాత్మక జర్మన్ పురస్కారం



బెర్లిన్ : ప్రముఖ రచయిత సల్మాన్ రష్దీ ప్రతిష్టాత్మక జర్మన్ పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్యంలో చేసిన విశేష కృషికి, నిరంతరం ఎదురవుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనే సంకల్పం, సానుకూల వైఖరికి గాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 22న ఫ్రాంక్ ఫర్ట్‌లో ఆయన ఈ బహుమతిని అందుకోనున్నారు. ఆయన తన రచనల్లో కథనాత్మక దృష్టితో పాటు నిరంతర సాహిత్య ఆవిష్కరణ, హాస్యం, జ్ఞానాన్ని మిళితం చేస్తారని జ్యూరీ తెలిపింది. హింసాత్మక విధానాలు అనుసరించే పాలక శక్తులు మొత్తం సమాజాన్ని నాశనం చేసే విధానాన్ని వివరించడంతోపాటు వ్యక్తుల ప్రతిఘటనను నాశనం చేయలేరని వివరిస్తారని పేర్కొంది. గతేడాది ఆగస్టులో న్యూయార్క్‌లో నిర్వహించిన ఓ సాహిత్య వేడుకలో ఆయన దాడికి గురైన సంగతి తెలిసిందే. ఆయన నిరంతరం శారీరక, మానసిక సమస్యలతో పోరాటం చేస్తున్నప్పటికీ.. రచనలను కొనసాగిస్తున్నారని జ్యూరీ ప్రశంసించింది.


పదం పదం కలుపుతూ ముందుకు సాగుతున్న విజూ కృష్ణన్, వి.శ్రీనివాసరావు తదితరులు


సందడి చేస్తున్న డప్పు కళాకారులు

ఉల్లాసంగా.. ఉత్తేజంగా...

పోలవరం నిర్వాసితుల మహా పాదయాత్ర


పాదయాత్ర బృందానికి తిలకం దిద్ది హారతులిస్తున్న మహిళలు


పాదయాత్రకు ముందు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -ఎటపాక, అల్లూరి సీతారామరాజు జిల్లా

పోలవరం పోరుకేక మహాపాదయాత్ర ఉత్సాహపూరిత వాతావరణంలో సోమవారం ప్రారంభమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక ప్రధాన కూడలి వద్ద మహాపాదయాత్రను ఆలిండియా కిసాన్‌సభ (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. సిపిఎం కార్యకర్తలు, అభిమానులు, పోలవరం నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పాదయాత్రలో పాల్గొన్న వారికి నిర్వాసితులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. డోలు, కొమ్ము, రేల నృత్యాలతో గిరిజనుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గిరిజన సంప్రదాయ రేలా నృత్యాన్ని కళాకారులతో సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, తెలంగాణ రాష్ట్ర సిపిఎం నాయకులు పోతినేని సుదర్శన్, సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు కలిసి నృత్యం చేశారు. గిరిజన సంప్రదాయ కొమ్ముడోలును వి.శ్రీనివాసరావు, విజూ కృష్ణన్, తెలంగాణ సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ ధరించి, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు సంబంధించి పుస్తకావిష్కరణ, ప్రత్యేక పాటల సీడీని ఆవిష్కరించారు. సభ ముగింపులో వలంటీర్లతో పాదయాత్ర సారధి వి.శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాదయాత్ర కాపవరం, బుట్టాయిగూడెం, సీతాపురం మీదుగా తోటపల్లి చేరుకుంది. తోటపల్లిలో భోజనం అనంతరం గన్నవరం గౌరీదేవిపేట, నందిగామ మీదుగా మురుమూరు చేరుకుంది. మురుమూరులో రాత్రి బస చేయనున్నారు.

హారతులు, తిలకాలతో పోరుయాత్రకు స్వాగతం

పోలవరం పోరుకేక పాదయాత్ర బృందానికి గ్రామగ్రామానా మహిళలు వీర తిలకాలు దిద్ది హారతి పట్టి సాదరంగా స్వాగతం పలికారు. కళాకారులకు, కార్యకర్తలకు, నిర్వాసితులకు అల్పాహారం, తాగునీరు కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా నాయకులు బలరాం, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, మహిళా సంఘం రాష్ట్ర నాయకులు కుంజా రాధ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, లోత రామారావు, మోడం నాగయ్య. విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి. డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్న, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, కూనవరం నాయకులు మేకల నాగేశ్వరరావు, చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్, ఎటపాక మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


గిరిజన సంప్రదాయ వేషధారణతో వాయిద్యాలు వాయిస్తున్న విజూ కృష్ణన్, శ్రీనివాసరావు
వేదికపై పి సుదర్శన్, మంతెన సీతారాం తదితరులు


పాదయాత్ర అగ్రభాగాన
గిరిజన సంప్రదాయ డోలు కొమ్ము నృత్యాలు



మళ్లీ ప్రయత్నిస్తా..



హాయ్ నేస్తాలు..!


నా పేరు పి.శశాంక్. మా అమ్మ పేరు సుజాత మా నాన్న పేరు రమ ప్రసాద్. మాది కడప జిల్లా. నేను ఎం.సి.హెచ్. స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నా. నాకు చిన్నప్పటి నుంచి కొత్తగా ఏమన్నా కనిపెట్టాలంటే చాలా ఇష్టం. ఒక రోజు మా స్కూల్లో సైన్స్ ఫెయిర్ కాంపిటీషన్ పెట్టారు. అందులో గెలిస్తే తరువాత మండల స్థాయిలో పోటీ ఉంటుంది. ఆ తరువాత జిల్లాస్థాయి, చివరిగా రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయి. ఇందులో నేను స్కూలు స్థాయి పోటీల్లో పాల్గొన్నా. Pulp and paper manufacturing process ప్రాజెక్ట్‌ను కష్టపడి నా సొంతంగా చేశా. పోటీలో నేను మొదటి స్థానం పొందాను. ఆ తర్వాత మండల స్థాయిలో పాల్గొనాలని మా సార్స్ చెప్పారు. వేరే స్కూల్లో జరిగాయి పోటీలు. నాతో పాటు మా సార్ కూడా వచ్చారు. అక్కడ అందరూ ఒకే టాపిక్ పైన చేశారు. నేను మాత్రం వేరేది చేశా. నా ప్రాజెక్టు ప్రెజెంటేషన్ అధికారులకు వివరించా. దీంతో అక్కడ కూడా నా ప్రాజెక్టుకు మొదటి స్థానం వచ్చింది.



ఆ తర్వాత పులివెందుల్లో జరిగిన జిల్లా స్థాయిలో జరిగిన సైన్సు ఫెయిర్ పోటీలకు వెళ్లా. అక్కడకు చాలామంది పిల్లలు వచ్చారు. చాలా హడావిడిగా ఉంది. దాంతో నాకు భయమేసింది. కొంచెం తడబడ్డా. ప్రాజెక్టు గురించి సరిగ్గా వివరించలేకపోయా. బహుమతి రాలేదు. కానీ బాధపడలేదు. ఇప్పుడు కాకపోతే మళ్లీ అయినా ప్రయత్నించొచ్చు అని నమ్మకం వచ్చింది. మీరు కూడా వినండి స్నేహితులారా, ఎప్పుడు ఓడిపోయినా బాధ పడకండి. మళ్లీ.. మళ్లీ ప్రయత్నించండి. తప్పకుండా సక్సెస్ సాధిస్తాం.

- పి.శశాంక్, 9వ తరగతి, వైఎస్ఆర్ జిల్లా, కడప మండలం
ఎం.సి.హెచ్.ఎస్., మెయిన్ కడప.

లెక్క తేల్చండి



చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

నేను గీసిన బొమ్మ



- అప్పినేని ఉజ్వల,
7వ తరగతి,
అభ్యాస విద్యాలయం,
విజయవాడ,
ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి.
ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



ఆడబిడ్డ పుట్టుక మాకు ఎంతో అపురూపం

'నీ రాకతో కోట్ల మంది మెగా అభిమానులకు ఆనందాన్ని పంచావు. రామ్ చరణ్, ఉపాసనలను తల్లిదండ్రులను చేశావు.. మమ్మల్ని గ్రాండ్ పేరెంట్స్‌ను చేశావు. ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది' అని రామ్‌చరణ్, ఉపాసన దంపతులకు కూతురు పుట్టిన సందర్భంగా చిరంజీవి ట్వీట్ చేశారు. 'మంగళవారం 1.49 నిమిషాలకు (అర్ధరాత్రి) రామ్‌చరణ్, ఉపాసన దంపతులు ఆడబిడ్డకు జన్మనిచ్చారు. మా ఇంటిల్లిపాదీ ఎంతో ఆనందంగా ఉన్నాం. ఆడబిడ్డ పుట్టుక మాకు ఎంతో అపురూపం. ఎన్నో సంవత్సరాలుగా వారిద్దరూ తల్లిదండ్రులు కావాలని, మా చేతిలో బిడ్డను పెట్టాలని కోరుకుంటున్నాం. భగవంతుడి ఆశీస్సులు, అభిమానుల ప్రేమాభిమానాలతో రామ్‌చరణ్-ఉపాసన తల్లిదండ్రులయ్యారు. దేశవిదేశాల నుంచి బంధువులు, శ్రేయభిలాషులు, మా ఆనందాన్నే తమ ఆనందంగా భావించే మా అభిమానులు వివిధ రూపాల్లో మా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు చెబుతున్నారు. చాలా ఆనందంగా ఉంది' అంటూ చిరంజీవి తన ఆనందాన్ని ఈ సందర్భంగా వ్యక్తపరిచారు.

వేణు కొత్త ప్రాజెక్టు ప్రకటన



'బలగం' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన వేణు యెల్దండి తన కొత్త ప్రాజెక్టును ప్రకటించారు.. దానికి సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్‌ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తన తదుపరి ప్రాజెక్ట్ స్క్రిప్ట్ వర్క్‌ని ప్రారంభించినట్లుగా పేపర్ పెన్‌తో ఉన్న ఫొటోను షేర్ చేసారు. ఇది బాగా వైరల్ అవుతోంది. ఈ ప్రాజెక్ట్ ఎవరితో ఉంటుంది అనే ఇతర వివరాలు రావాల్సి ఉన్నాయి.

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ

హాకీ షెడ్యూల్ విడుదల

- **3న చైనాతో,**

9న పాకిస్తాన్‌తో మ్యాచ్‌లు

చెన్నై: ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ-2023 హాకీ షెడ్యూల్ మంగళవారం విడుదలైంది. ఆగస్టు 3నుంచి 12వరకు రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో టోర్నీ జరగనుంది. భారతజట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను చైనాతో ఆడనుంది. ఇక డిఫెండింగ్ ఛాంపియన్ కొరియా-జపాన్ జట్ల మధ్య జరిగే అదేరోజు జరిగే తొలి మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభం కానుంది. మొత్తం 6జట్లు టైటిల్‌కై తలపడనున్నాయి. భారత్‌తోపాటు కొరియా, మలేషియా, పాకిస్తాన్, జపాన్, చైనా జట్లు బరిలోకి దిగనున్నాయి. ఆరుజట్లు ఒకే గ్రూప్‌లో ఉండగా.. లీగ్ దశ ముగిసిన అనంతరం టాప్-4 లో ఉన్న జట్లు సెమీస్‌లో తలపడనున్నాయి. ఈమేరకు హాకీ ఇండియా అధ్యక్షులు దిలీప్ టర్కే మాట్లాడుతూ.. ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీకి చెన్నై ఆతిథ్యమిస్తోందని భారతజట్టు టైటిల్ చేజిక్కించుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే ఆటగాళ్ల జాబితాను వెల్లడిస్తామన్నారు. ఇక తమిళనాడు హాకీ ప్రెసిడెంట్ శేఖర్ జె. మనోహర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ టోర్నమెంట్ అయిన ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ చెన్నై ఆతిథ్య హక్కులు దక్కడం అరుదైన గౌరవంగా భావిస్తున్నామని, టోర్నీ సజావుగా సాగేందుకు కృషిచేస్తామన్నారు. ఇక భారత 2011, 2016, 2018లో, పాకిస్తాన్(2012, 2013, 2018) జట్లు మూడేసిసార్లు టైటిల్ విజేతగా నిలిచాయి.



Hero
ASIAN CHAMPIONS TROPHY
CHENNAI 2023

తేదీ	జట్లు	సమయం
ఆగస్టు-3	కొరియా × జపాన్ మలేషియా × పాకిస్తాన్ భారత్ × చైనా	సా.4.00గంలకు రా.6.15ని.లకు రా.8.30గంలకు
ఆగస్టు-4	కొరియా × పాకిస్తాన్ చైనా × మలేషియా భారత్ × జపాన్	సా.4.00గంలకు రా.6.15ని.లకు రా.8.30గంలకు
ఆగస్టు-6	చైనా × కొరియా పాకిస్తాన్ × జపాన్ భారత్ × మలేషియా	సా.4.00గంలకు రా.6.15ని.లకు రా.8.30గంలకు
ఆగస్టు-7	జపాన్ × మలేషియా పాకిస్తాన్ × చైనా భారత్ × కొరియా	సా.4.00గంలకు రా.6.15ని.లకు రా.8.30గంలకు
ఆగస్టు-9	జపాన్ × చైనా మలేషియా × కొరియా భారత్ × పాకిస్తాన్	సా.4.00గంలకు రా.6.15ని.లకు రా.8.30గంలకు
ఆగస్టు-11	5-6స్థానాలకు సెమీఫైనల్-1 సెమీఫైనల్-2	సా.3.30గంలకు రా.6.000గంలకు రా.8.30గంలకు
ఆగస్టు-12	3-4స్థానాలకు ఫైనల్	రా.6.00గంలకు రా.8.30గంలకు

ఆసియా క్రీడల ఫ్లాగ్ బేరర్‌గా రోహన్ బొప్పన్న



న్యూఢిల్లీ: సీనియర్ టెన్నిస్ ఆటగాడు రోహన్ బొప్పన్నకు అరుదైన గౌరవం దక్కింది. చైనాలోని గ్వాంఝు వేదికగా జరగనున్న ఆసియా క్రీడల్లో భారత బృందానికి ఫ్లాగ్ బేరర్‌గా ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్(ఎఐటిఎ) మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. అలాగే ఆసియా క్రీడల్లో ఆడే 12మంది టెన్నిస్ ఆటగాళ్ల జట్టును ప్రకటించింది. పురుషుల బృందంలో సుమిత్ నాగల్, శశికుమార్ ముకుంద్, డేవిస్ కూపర్, రామ్‌కుమార్ రామ్‌నాథన్, యుకీ బాంబ్రీ, సాకెత్ మైనేనితోపాటు 43ఏళ్ల రోహన్ బొప్పన్న కూడా ఉన్నాడు. ఇక మహిళల బృందంలో గత ఆసియా క్రీడల సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం నెగ్గిన అంకిత రైనాతోపాటు కర్మన్ కౌర్ థండి, రుతురాజ్ భోస్లే, సహజ యామలపాటి, వైదేహి, చౌదరి, ప్రధానే ఉన్నట్లు తెలిపింది. 2018 జకార్తా వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో భారత టెన్నిస్ బృందం ఒక స్వర్ణ పతకంతోపాటు రెండు కాంస్య పతకాలను సాధించింది.

చిరాగ్-సాత్విక్ జోడీకి కెరీర్ బెస్ట్

తాజా బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్‌లో 3వ స్థానం



లాసన్నె: ఇండోనేషియా బ్యాడ్మింటన్ టోర్నీ డబుల్స్ టైటిల్ సాధించిన సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో 3వ స్థానంలో నిలిచారు. ఇండోనేషియా సూపర్-1000 పురుషుల డబుల్స్ టైటిల్ నెగ్గడంతో వీళ్ల ర్యాంక్ మెరుగైంది. ఇక ఇండోనేషియాకు చెందిన ఆర్డియాంటో, అల్ఫియాన్ ద్వయం అగ్రస్థానంలో, చైనాకు చెందిన లియాంగ్, వాంగ్ రెండో రెండో ర్యాంక్ నిలిచారు. ఇక పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్ 9వ ర్యాంక్‌లో ఉండగా.. లక్ష్యసేన్ 16వ, కిదాంబి శ్రీకాంత్ 19వ ర్యాంక్‌లో నిలిచి టాప్-20లో చోటు దక్కించుకున్నారు. ఇక మహిళల సింగిల్స్ లో పివి సింధు 12వ ర్యాంక్‌లో ఉండగా.. సైనా నెహ్వాల్ 31వ ర్యాంక్‌లో నిలిచారు. మహిళల డబుల్స్‌లో యువ షట్లర్లు త్రీసా జోలీ-గాయత్రీ గోపీచంద్ జోడీ 16వ ర్యాంక్‌లో ఉన్నారు.

సికిందర్ రాజా ఆల్‌రౌండ్ ప్రతిభ

నెదర్లాండ్స్‌పై ఆరు వికెట్ల తేడాతో జింబాబ్వే గెలుపు

హరారే: ఐసిసి వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్ గ్రూప్-ఏలో జింబాబ్వే జట్టు ఆరు వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై ఘన విజయం సాధించింది. నెదర్లాండ్స్ జట్టు 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 315పరుగులు చేయగా.. ఛేదనలో సికిందర్ రాజా 52బంతుల్లో 102పరుగులు సెంచరీతో కదం తొక్కడంతో జింబాబ్వే జట్టు 40.5ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 319పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సికిందర్ రాజాకు దక్కింది. మరో మ్యాచ్‌లో నేపాల్ జట్టు 6వికెట్ల తేడాతో అమెరికాపై గెలిచింది. అమెరికా 49ఓవర్లలో 207పరుగులు చేయగా.. ఛేదనలో నేపాల్ జట్టు 43ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 211పరుగులు చేసి విజయం సాధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68